సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 248

బుధవారం 29-11-2023





SIMULTANEOUSLY PRINTED AT MAHABOOBNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు చెయ్యి గుర్తుకే మన ఓటు





"జాతిని జాగృత పరచే గీతాల జన జాతర తెలంగాణ..
వేల కొలదిగా వీరులు నేల ఒరిగిపోతేనేమి..
తరగనిది మీ త్యాగం.. మరువనిది మీ పోరాటం." - అందెశ్రీ

ప్రియమైన తెలంగాణ ప్రజలారా..

వీరుల త్యాగాలకు విలువివ్వని రాజకీయమెందుకు?
ప్రజల ఆకాంక్షలను నెరవేర్చని అధికారమెందుకు?

తెలంగాణనే నినాదమై నాలుగు కోట్ల గొంతుకలు ప్రతిధ్వనించినప్పుడు మీ పోరాట పటిమ చూశాను. స్వరాష్ట్రమే సిద్ధాంతమై త్యాగాలు చేస్తున్నప్పుడు తల్లిగా తల్లడిల్లాను. 60 ఏండ్ల మీ ఆకాంక్షను నెరవేర్చే అరుదైన అవకాశం మాకు వచ్చినందుకు గర్వపడ్డాము. తెలంగాణ కల సాకారంతో మీరు చూపించిన అభిమానానికి ముగ్ధురాలినయ్యాను. ఆరోజు మీ కళ్ళల్లో చూసిన ఆనందం ఏనాటికీ చెదిరి పోకూడదని ఆకాంక్షించాను.

పదేళ్ల తెలంగాణ ప్రస్థానంలో అమరుల ఆశయాలకు భిన్నమైన, వీరుల త్యాగాలకు విలువలేని పాలన నడుస్తోంది. నాటి ఉద్యమ ఆకాంక్షలు ఏవీ నెరవేరని పరిస్థితి. ఇది కాదు కదా మీరు ఆశించిన, మనం కాంక్షించిన తెలంగాణ! సకల జనులు, సబ్బండ వర్గాలు సమాన అభివృద్ధి చెంది, స్వేచ్ఛ, ఆత్మగౌరవంతో జీవించే తెలంగాణను మనం ఆశించాము. కానీ ఆ ఆకాంక్షలు నెరవేరకపోవడం నాకు ఆవేదన కలిగిస్తోంది.

మనం కలలుగన్న తెలంగాణ సాకారం చేసుకునే సదవకాశం ఇప్పుడు మన ముందు ఉన్నది. మన భవిష్యత్తును నిర్మించుకునే నిర్ణయం మన చేతుల్లోనే ఉన్నది. ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు **కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పాలనను హామీ ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మా గ్యారెంటీలను అమలు చేస్తామని మీ తల్లిగా మాట ఇస్తున్నాను.**

అరాచక పాలన అంతం కోసం.. ప్రజా పాలన స్థాపన కోసం..
మనం కలలుగన్న తెలంగాణ కోసం.. మనం కోరుకున్న భవిష్యత్తు కోసం..
కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను.

జై కాంగ్రెస్!
జై తెలంగాణ!

మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి

సోనియా గాంధీ





మహాలక్ష్మి	**రైతు భరోసా**	**గృహజ్యోతి**	**ఇందిరమ్మ ఇండ్లు**	**యువవికాసం**	**చేయూత**
మహిళలకు ప్రతి నెలా ₹2500 ₹500కే గ్యాస్ సిలిండర్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం	ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి ₹15000 వ్యవసాయ కూలీలకు ₹12000 వరి పంటకు ₹500 బోనస్	ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్	ఇల్లు లేని వారికి ఇంటి స్థలం మరియు ₹5 లక్షలు ఉద్యమకారులకు 250చ.గ. ఇంటి స్థలం	విద్యార్థులకు ₹5 లక్షల విద్యా భరోసా కార్డు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్	₹4000 నెలవారీ పింఛను ₹10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా



ఆధ్యాత్మిక మార్గంలో నీకు ఎవరి మద్దతూ లేనప్పుడు ఒంటరిగా నడువు. అపరిపక్వ మనుషులు నీకు జత కాలేరు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 29 నవంబర్ 2023

ఎవరికీ పట్టని ప్రాణాలు

జానెడు పొట్ట కోసం ఉన్న ఊరునూ, అయినవారినీ వదిలి దూరతీరాలకు పోయి కాయకష్టం చేసే వారు బతుకుపోరాటంలో ఎప్పుడూ ఓడిపోతూనే వుంటారు. మహానగరాల్లో రాళ్లెత్తే కూలీలుగా, క్వారీల్లో గనుల్లో చెమటోడ్చే కార్మికులుగా, భారీ భవంతులకు కాపలాదార్లుగా, స్థానికులు చేయసాహసించని అనేక ప్రమాదకరమైన పనులను తప్పనిసరిగా తలకెత్తుకుని ప్రాణాలు పణంగా పెట్టే బడుగుజీవులుగా వీరు అందరికీ సుపరిచితులే. కానీ భద్రత, ఆరోగ్యం వంటివి వీరికెప్పుడూ ఆమడదూరమే. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా అర్ధాకలితో కాలం గడిపే అలాంటి అభాగ్యులపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) విడుదల చేసిన నివేదిక దిగ్భ్రాంతికరమైన నిజాలు వెల్లడించింది. పనికి సంబంధించిన ప్రమాదాల్లో చిక్కుకుని, వ్యాధుల బారినపడి ప్రపంచవ్యాప్తంగా సగటున ఏటా 30 లక్షలమంది కన్నుమూస్తున్నారని ఆ నివేదిక అంచనా. కార్మికుల ఉసురుతీస్తున్న పది రకాల కారణాలను ఆ నివేదిక గుర్తించింది. సుదీర్ఘమైన పనిగంటలు (వారానికి 55 గంటలు లేదా అంతకన్నా ఎక్కువ) కార్మికుల మరణాలకు ప్రధాన కారణమవుతున్నాయని, ఆ కేటగిరీలో ఏటా మరణిస్తున్నవారు 7,44,924 మంది అని తేల్చింది. ఆ తర్వాత స్థానం సూక్ష్మ ధూళి కణాలు, పొగలు, వాయువులది. వాటి బారినపడి మరణించేవారు ఏటా 4,50,381 మంది అని లెక్కేసింది. ఇవిగాక నికెల్, ఆర్సెనిక్, డీజిల్ కాలుష్యం, సిలికా, ఆస్బెస్టాస్ తదితరాల వల్ల మరో 15 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. వీటిల్లో 63 శాతం ఆసియా–పసిఫిక్ ప్రాంత దేశాల్లోనే వుంటున్నాయని వివరించింది. వ్యవసాయం, రవాణా, మైనింగ్, నిర్మాణరంగం వగైరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి నివారణకు అనుసరించాల్సిన విధానాల రూపకల్పనకు సోమవారం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రారంభ మైన నాలుగురోజుల సదస్సు సందర్భంగా ఐఎల్‌ఓ ఈ నివేదిక వెలువరించింది.

మనవరకూ తీసుకుంటే జనాభాలో మూడోవంతు మంది వలసబాట పడుతున్నారు. వీరంతా పల్లెటూళ్లను వదిలి పట్టణాలకూ, నగరాలకూ వలసపోయేవారే. ఇలాంటివారు ఎలాంటి గుర్తింపూ లేకుండా బతుకులీడుస్తున్నారు. వారికి ఓటు హక్కుండదు. రేషన్ కార్డు వుండదు గనుక చవగ్గా సరుకులు లభించవు. స్థానికతకు అవకాశం లేదు గనుక వారి హక్కుల కోసం, పని పరిస్థితుల మెరుగు కోసం పోరాడే సంస్థలుండవు. అసంఘటిత రంగ కార్మికులుగా కనీసం చట్టప్రకారం దక్కాల్సినవి వారికి ఎప్పుడూ దూరమే. జ్వరమో, మరే వ్యాధో ముంచుకొచ్చినా చూసే దిక్కుండదు. ఇలాంటి అభాగ్యులకు కుటుంబాలుంటే ఈ కష్టాలన్నీ మరిన్ని రెట్లు ఎక్కువ. ఈ కార్మికుల కాంట్రాక్టర్లు సర్వసాధారణంగా ఏదో ఒక పార్టీ ఛత్రఛాయలో వుంటారు గనుక అధికారులు వారి జోలికి పోవటానికి, కార్మికుల ప్రయోజనాలు కాపాడటానికి సాహసించరు. మెరుగైన సాంకేతికత లున్న యంత్ర సామగ్రి లభ్యమవుతున్నా వాటిపై పెట్టుబడులు పెట్టడం దండగన్న భావనతో ఈ కార్మికులతోనే అన్నీ చేయిస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవటం లేదా అంగవికలురు కావటం రివాజు. ప్రపంచవ్యాప్తంగా గాయాలపాలై ఏటా 3,63,283 మంది కార్మికులు మరణిస్తున్నారని ఐఎల్‌ఓ నివేదిక చెబుతోంది. మన దేశంలో 2017–2020 మధ్య సగటున రోజూ ముగ్గురు కార్మికులు ప్రమాదాల బారినపడి చనిపోతున్నారని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ డేటా తెలిపింది. ఇవన్నీ రిజిస్టరయిన ఫ్యాక్టరీలకు సంబంధించినవి. అసంఘటిత రంగంలో సంభవించే మరణాలకు అరకొర డేటాయే వుంటుంది. సాధారణంగా ఆ రంగంలో సంభవించే చాలా మరణాలు సహజ మరణాల ఖాతాలోకి పోతుంటాయి. వైద్యులు కూడా వారికి సహకరిస్తుంటారు. అసంఘటిత రంగ కార్మికులు చేసే వెట్టిచాకిరీ అపారమైన సంపద సృష్టిస్తోంది. కానీ ఆ సంపద సృష్టికర్తలు అనామకులుగా మిగిలిపోతున్నారు. ముగిసిపోతున్నారు.

అంతర్జాతీయంగా నిబంధనలు లేవని కాదు. పని పరిస్థితుల్లో భద్రత, ఆరోగ్యం వంటి అంశాలపై ఐఎల్‌ఓ రూపొందించిన అంతర్జాతీయ ఒడంబడికను 187 సభ్య దేశాల్లో కేవలం 79 దేశాలు ఆమోదించాయి. కనీసం అందుకు సంబంధించిన నియమ నిబంధనలకైనా సభ్య దేశాలన్నీ ఆమోదం తెలపలేదు. అందుకు కేవలం 62 దేశాలు మాత్రమే సమ్మతించాయి. ఈ రెండు ఒడంబడికలకూ మన దేశం ఆమడ దూరంలో వుంది. వృత్తిపరంగా ఎదురయ్యే ఇబ్బందులేమిటో, అందులో పొంచివుండే ప్రమాదాలేమిటో బయటివారికన్నా కార్మికులకే ఎక్కువ తెలుస్తుంది. కనీసం అవి బయటివారు తెలుసుకోవటానికైనా కార్మికులకు సంఘాలుండాలి. వారి తరఫున గట్టిగా ప్రశ్నించే నేతలుండాలి. కానీ మన దేశం వరకూ చూస్తే కార్మిక సంస్కరణల పేరిట తీసుకొచ్చిన కొత్త చట్టాలు అలాంటి అవకాశాలను మరింత నీరుగార్చాయి. ఫలితంగా బాల కార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరీ, వివక్ష, అధిక పనిగంటలు వంటివన్నీ అసంఘటిత రంగ కార్మికులకు శాపాలవుతున్నాయి. రిజిస్టరైన ఫ్యాక్టరీల్లోనే తప్పుడు లెక్కలు చూపించి కార్మికుల భద్రతకు సంబంధించిన కమిటీల ఏర్పాటు, లైంగిక వివక్ష నిర్మూలన తదితరాలను ఎగ్గొడుతున్నారు. ఇక ఎవరికీ పట్టని అసంఘటితరంగ కార్మికుల గురించి చెప్పేదేముంది? సిడ్నీలో సాగుతున్న సదస్సులో 127 దేశాలకు చెందిన మూడు వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. 30 గోష్ఠులు, ఆరు సాంకేతిక సదస్సులు కూడా వుంటాయంటున్నారు. కనీసం ఈ సదస్సు తర్వాతనైనా కార్మికుల భద్రతకు ముప్పుగా పరిణమించిన సమస్యలను నివారించటానికి పకడ్బందీ విధానాలు రూపొందించటం తమ బాధ్యతగా ప్రభుత్వాలు గుర్తించాలి.

ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు

అభిప్రాయం



ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నవంబర్ 29కి ఒక ప్రత్యేకత ఉంది. కేసీఆర్ తన అంతిమ అస్త్రంగా 2009లో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్న ఆ రోజు ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పింది. అనేక దశాబ్దాలుగా వివిధ పోరాట రూపాల్లో వ్యక్తమైన తెలంగాణ ఆకాంక్షకు ఒక స్పష్టమైన లక్ష్యం 1996 నాటికే ఏర్పడింది. ప్రజా సంఘాలు, మేధావులు, కవులు, రచయితలు సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ విస్తృత ప్రజా చైతన్యానికి దోహదపడిన సందర్భంలో కేసీఆర్ 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేసి ఉద్యమ శక్తులకు ఒక కొత్త రాజకీయ వేదిక రూపొందించారు. అయితే, నవంబర్ 29 నాటి ఆ దీక్ష ఉద్యమాన్ని అంతిమ లక్ష్యానికి చేర్చింది.

కేసీఆర్‌ను అపర చాణక్యుడు అనేవారు ఆచార్య జయశంకర్. ఆయన వ్యూహాలు, ఎత్తుగడలు అలాగే ఉంటాయి. ఎప్పుడైతే ప్రత్యర్థి బేలగా, డీలా పడిపోయి ఉంటాడో, తన బలగం ఐకమత్యం లేక సతమతం అవుతుందో అలాంటప్పుడు అదును చూసి దెబ్బతీసే యుద్ధ ప్రకటన చేయాలన్న చాణక్య నీతిని ప్రదర్శించాడు కేసీఆర్. 2009లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని రెండోసారి అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం తరువాత కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్తమై పోయింది. ఆత్మ స్థైర్యం కోల్పోయి రాష్ట్ర నాయకత్వం అయోమయంలో ఉన్న దశలో కేసీఆర్ తన ఆఖరి అస్త్రమైన ఆమరణ దీక్షను ప్రకటించారు. తెలంగాణ ఉద్యోగులకు సంబంధించిన ఒక సమస్య నేపథ్యంలో ఆయన ఉన్నట్టుండి ఈ నిర్ణయం ప్రకటించారు.

2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీచేసి, కేంద్ర ప్రభుత్వ 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్'లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చేర్చినప్పటికీ దానిని అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదనే సంగతి ఆయనకు అర్థమయ్యింది. ఆరేళ్ళ పాటు ఢిల్లీలో అనేక పార్టీలతో, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న భాగస్వామ్య పక్షాలతో, రాష్ట్ర శాసనసభతో పాటు, పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని రాజకీయ పార్టీలతో ఆయన ఏకాభిప్రాయ సాధన కోసం ఐదేళ్ళు ప్రయత్నించారు. అప్పటికే తన పార్టీ ప్రారంభించి పదేళ్లయిన దరిమిలా ఉద్యమాన్ని పదునెక్కించే లక్ష్యంతో ప్రత్యక్ష యుద్ధానికి దిగక తప్పదని దీక్షబూనారు. కరీంనగర్‌లోని తన నివాసం నుంచి సిద్దిపేట దీక్షా స్థలికి బయలుదేరిన కొద్ది నిమిషాల్లోనే ఆయనను అరెస్టు చేసి ఖమ్మం తరలించారు. దీనితో తెలంగాణ ఒక్కటయ్యింది. అప్పటివరకు ఆచితూచి చూస్తున్న విద్యార్థి, ఉద్యోగ, కార్మిక వర్గాలతో పాటు, పల్లెలు పట్టణాలు అన్న తేడా లేకుండా తెలంగాణ ఒక విశాల సంగ్రామ వేదికయ్యింది. మరోవైపు ఖమ్మం నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించిన కేసీఆర్ ఆరోగ్యంపై అనేక వదంతులు వచ్చాయి. దీక్ష ప్రారంభమైన 11వ రోజు డిసెంబర్ 9న అప్పటి హోమ్ మంత్రి పి. చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పార్లమెంటులో ప్రకటన చేశారు.

దీక్ష దానికి అదే ముగింపు కాదు. తాత్విక విశేషార్థంలో దీక్ష అంటే ఒక క్రతువుకు ముందు సన్నద్ధత. తెలంగాణ ఏర్పాటు డిసెంబర్ 9తో పూర్తవలేదు. మరో ఐదేళ్లపాటు తెలంగాణా సబ్బండ వర్ణాలు నిలబడి పోరాడి, అనేక అవాంతరాలు ఛేదించుకుని 2014లో సంపూర్ణ తెలంగాణను సాధించుకునే దాకా అదొక క్రతువులాగే సాగింది.

భారత దేశ చరిత్రలో ఏ సామాజిక ఉద్యమం సాధించని విజయాన్ని తెలంగాణా ఉద్యమం సాధించింది. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటంలోనూ, అమలు పరచడంలోనూ



రాజ్యాంగ వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజలే స్వయంగా పూనుకుని తమ హక్కులను కాపాడుకోవాలంటారు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్. భారత రాజ్యాంగం ప్రజల ఆకాంక్షల మేరకు, అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాలను ఏర్పాటు చేసుకునే హక్కును కల్పించింది. ప్రజలు రాజ్యాంగ పరిధిలో అన్ని పోరాట రూపాలనూ వాడుకుని, సకల జనుల సమ్మె, సాగర హారం, సంసద్ యాత్ర వంటి రాజకీయ, సాంస్కృతిక, ప్రజాస్వామిక పోరాటాలతో తమ హక్కును సాధించుకున్నారు. ఇలా ఒక ఆకాంక్షను పోరాటంగా మార్చి, రాజకీయ ఉద్యమంగా మలిచి, అంతిమంగా రాజ్యాంగ హక్కును సాధించుకోవడం వెనుక ఆ దీక్ష ఒక చోదక శక్తిగా పనిచేసింది. దానికి సబ్బండ వర్ణాల గుండె నిబ్బరం తోడయ్యింది.

తెలంగాణ ఆవిర్భవించి పది సంవత్సరాలు కావొస్తోంది. స్వరాష్ట్రం సాధించుకోవడంతో పాటు, స్వపరిపాలన ఫలితాలను కూడా ఇప్పుడిప్పుడే నవ తెలంగాణా ఆవిష్కరించుకుంటున్నది. నీళ్లు, నిధులు, నియామకాలనే ఉద్యమ ఆకాంక్షల ప్రాతిపదికన పునర్నిర్మాణ ప్రణాళికను ఏర్పాటు చేసుకుని తెలంగాణ తనను తాను పునరావిష్కరించుకుంటున్నది. ఒకప్పుడు 'వరి పంటను నేర్పించింది మేమే' అన్న డెప్పిపొడుపు మాటలు అన్నవారి నోళ్లు మూయించే విధంగా ఇప్పుడు దేశానికే ధాన్యాగారంగా మారిపోయింది. అప్పుల ఊబిలో కుదేలయిపోయిన రైతుకు ఆసరాగా ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుతున్నాయి. ఉచితంగా కరెంటు, సాగునీరు, పెట్టుబడి సాయం, రైతుబీమాతో 'రైతుబంధు' రాష్ట్రంగా ముందుకు సాగుతోంది. సంప్రదాయ పరిశ్రమలకు తోడు శాస్త్ర సాంకేతిక రంగాలకు తెలంగాణ కేంద్రం అవుతోంది. ఉత్పత్తి, తయారీ, సేవా రంగాల్లో తన సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. పదేళ్ల క్రితం తెలంగాణా ఎక్కడుందో కూడా తెలియని వాళ్ళు ఇప్పుడు పెట్టుబడులకు, ఉద్యోగాలకు హైదరాబాద్ నగరాన్ని వెతుక్కుంటూ వస్తున్నారు. ఆర్థిక రంగంలో నిలదొక్కుకుంటూనే ఐదు ప్రధాన ఆహారోత్పత్తి విప్లవాల్లో– ధాన్యం, పాలు, చేపల పెంపకం, గొర్రెల పెంపకం, ఆయిల్ పామ్‌లో – రాష్ట్రం అనూహ్య పురోగతిని సాధిస్తోంది.

ఉద్యమం నుంచి వచ్చిన నాయకత్వానికి ఎప్పుడైనా సవాళ్లు ఎక్కువగానే ఉంటాయి. సహజంగానే పరిపాలనలో పరిమితులు ఉంటాయి. అపరిమితమైన ఆకాంక్షలు, పరిమితమైన వనరులను సమతుల్యం చేసుకోవడం అవసరం. కొంతవరకు కష్టమైన పనే అయినా ప్రజలకు విడమరిచి చెప్పినప్పుడు వారు అర్థం చేసుకుంటారు. ఆ సామర్థ్యం కేసీఆర్‌లో ఉంది. ప్రజలతో నిరంతర సంభాషణ, సమన్వయం అవసరం. ప్రాధాన్యాలను నిర్ణయించుకోవడంలో, ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల అసంతృప్తిని అధిగమించవచ్చు. ఏ సమాజం కూడా పదేళ్లలో సంపూర్ణ సంతృప్త స్థాయికి చేరుకోదు. ఇప్పుడు కొన్ని కీలక రంగాల మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలు మన మానవాభివృద్ధికి సూచికలు. వైద్యం ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. విద్యారంగానికి నిధులు పెరగాలి. గురుకుల విద్యాలయాలు కొత్త విప్లవాత్మక మార్పులకు కేంద్రాలవుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు పెరగాలి. విద్యలో నాణ్యత పెరగాలి. అదే విధంగా రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్న భావం ఉంది. వాటి మీద దృష్టి పెట్టాలి. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందించగలగాలి. రాబోయే కాలంలో ఈ రంగాల మీద ప్రత్యేక శ్రద్ధ అవసరం. దక్షత గల నాయకత్వానికి అది పెద్ద సమస్య కాదు.

ఇప్పుడు సమస్యంతా ప్రగతి నిరోధక శక్తులతోనే! తెలంగాణ ఏర్పాటు విషయంలో తాత్సారం చేసిన శక్తులు, 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు తెలంగాణ పంచాయతీ తెగనీయకుండా చేసిన వాళ్ళు తెలంగాణ మీద పెత్తనానికి బయలుదేరి వస్తున్నారు. ఢిల్లీ పార్టీల పాలనలో ఏమయ్యిందో చూశాం. తెలంగాణ సమస్యల కోసం కలం పట్టిన వాళ్ళను, గొంతువిప్పిన వాళ్ళను, గజ్జెకట్టిన వాళ్లను, మానవ హక్కుల కోసం నిలబడిన వాళ్ళను జైళ్లలో కుక్కి, నిర్బంధించారు. మరో పక్క మతతత్వంతో మానవత్వాన్ని మంట గలిపిన శక్తులు ముందుకు వస్తున్నాయి. మనుషులు ఏం తినాలి, ఏం మాట్లాడాలి, చివరకు ఏం ఆలోచించాలో కూడా వాళ్ళే చెబుతారు. ఒకరు రాష్ట్రాన్ని మార్చేస్తాం అంటే, ఇంకొకరు హైదరాబాద్ పేరు మారుస్తామని శపథాలు చేస్తున్నారు. మనం వాళ్ళలాగా మారాలా, మన రాష్ట్రాన్ని మన ఆకాంక్షలకు అనుగుణంగా మార్చుకోవాలా తేల్చుకోవాల్సిన సమయం ఇది. తెలంగాణా ఆలోచించాల్సిన సందర్భం ఇది.

వ్యాసకర్త సోషియాలజీ ప్రొఫెసర్, డా॥ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరో జీవితం



ఉత్తరకాశీలోని సిల్‌క్యారా సొరంగం ఇప్పుడు తెరుచుకుంది. 17 రోజుల భారీ సహాయక చర్య ఎట్టకేలకు ముగింపునకు వచ్చింది. లోపల చిక్కుకు పోయిన 41 మంది కార్మికులు ఊపిరి పీల్చుకున్నట్టే! మొత్తానికి, చీకటి తర్వాత వెలుగు వచ్చినట్టయింది.

– పీయూష్ రాయ్, జర్నలిస్ట్

మానసిక క్షోభ



గాజాలో బంధితులుగా చేపట్టబడిన ఇద్దరు అమ్మాయిల (దఫ్నా–14 ఏళ్లు, ఎలా–8.5 ఏళ్లు) తల్లిగా నేను కచ్చితంగా చెప్పాలనుకుంటున్నది... వాళ్ల ప్రియమైనవాళ్ల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలతో హమాస్ క్రూరమైన మానసిక యుద్ధం కొనసాగిస్తోంది. బంధితులందరినీ హమాస్ వెంటనే విడుదల చేయాలి.

– మాయన్ జిన్, తల్లి

తలవంపేనా?



ఇటీవలి దక్షిణాఫ్రికా సమావేశాల్లో, 'బ్రిక్స్'ను 5 నుంచి 11 సభ్యదేశాలకు విస్తరించాలని కూటమి నిర్ణయించింది. దానికి నాయకత్వం వహించిన చైనాకు దౌత్యపరమైన ఇబ్బంది కలిగించేలా, అర్జెంటీనా నూతన ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆ సభ్యత్వం వల్ల పెద్ద ప్రయోజనమేమీ లేదంటూ బ్రిక్స్‌లో చేరిక ఆహ్వానాన్ని అంగీకరించబోనట్టుగా సంకేతాలిచ్చింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ఆయనేనా?



ఒక వైద్యుడిగా మీకు రెండు అందమైన పేర్లున్న ఒక వ్యాధిని పరిచయం చేస్తాను: సూడొలాజికల్ ఫాంటాస్టికా లేదా మైథోమేనియా. ఈ వ్యాధి ఉన్నవాళ్లు అలవాటుగా అబద్ధాలాడుతారు. (ఇది చెప్పగానే) ఒక భారతీయుడిగా మీ మనసుకు ఎవరు గుర్తుకు వస్తున్నారో నేను అడగటం లేదు!

– షా ఆలమ్ ఖాన్, కాలమిస్ట్

ఆత్మీయతే మందు



మీరూ మనుషులే, నేనూ మనిషినే! మీకూ సంతోషమయ జీవితం కావాలి, నాకూ సంతోషమయ జీవితం కావాలి. కానీ ఈ లక్ష్యం కేవలం భౌతిక విలువలతో నెరవేరదు. మనం మరింత దయాపూరితంగా ఉండాలంటే, మనందరికీ ఆత్మీయత కావాలి.

– దలై లామా, బౌద్ధగురువు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

యువతరంలో అసంతృప్తి

తెలంగాణ రాష్ట్రంలో యువత ఎక్కువ సంఖ్యలో వున్నారు. తాము ఎన్నో ఉద్యమాలు చేసి సాధించిన స్వరాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయని ఆశించారు. కానీ వారి ఆశలు కల్లలయ్యాయి. ఈ పరిస్థితుల్లో వారు బీజేపీ వైపు చూస్తున్నారు. చాప కింద నీరులా యువత బీజేపీ కోసం చాలా గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఎందరో యువత ప్రాణ త్యాగం చేశారు. ఇప్పుడూ నిరుద్యోగంతో యువత ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. అంటే ఇప్పటికీ యువత పరిస్థితిలో ఎటువంటి మార్పులేదనే కదా! నిరుద్యోగ యువత దారుణ పరిస్థితికి కారణం అయిన కేసీఆర్‌ను గద్దె దించాలని ఎక్కువ మంది యువత ఆలోచిస్తున్నారు.

స్వరాష్ట్ర సాధన కోసం మొదటి నుండి బీజేపీ పాటుపడింది. అధికారంలోకి వస్తే 'వంద రోజుల్లో తెలంగాణ' అని మేనిఫెస్టోలో బీజేపీ పెట్టడంతో... ఎక్కడ ఆ పార్టీకి తెలంగాణ ఇచ్చిన పేరు వస్తుందో అనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. బీజేపీ లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేది కాదు. బీజేపీ నాయకురాలు 'తెలంగాణ చిన్నమ్మ' సుష్మా స్వరాజ్ చేసిన కృషి మరువలేనిది. ఇక్కడి ప్రజల ఆవేదన అర్థం చేసుకున్న ఆమె దేశానికి తెలంగాణ పోరాట స్ఫూర్తిని చాటి చెప్పారు. బీజేపీ లేకుండా తెలంగాణ ఏర్పడేది కాదు. కాంగ్రెస్ ఇచ్చేది కాదు. కాబట్టి తెలంగాణ యువత దేశంలో, రాష్ట్రంలో బీజేపీ సర్కార్లు (డబుల్ ఇంజన్ సర్కార్) ఏర్పడితే రాష్ట్రం అభివృద్ధి అవుతుందని భావిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమ ఆవేదనను నిరుద్యోగ యువత ఓటు ద్వారా తెలియచేయాలనుకొంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కొరకు భారీగా నిధులు కేటాయించింది. రాష్ట్రంలో రహదారుల నిర్మాణంపై దృష్టిపెట్టి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసింది. ప్రధాన హైవేలను సుందరంగా తీర్చి దిద్దిన కేంద్ర ప్రభుత్వం... గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామ, పట్టణ ప్రాంతాల్లో 'వైకుంఠ ధామాల' నిర్మాణం వంటివాటికి కృషి చేసింది. 'ఉపాధి హామీ' పథకం ద్వారా ప్రతి గ్రామానికీ నిధులు కేటాయించినా... కమీషన్లు తీసుకొని నాణ్యమైన పనులు చెయ్యకుండా గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే యువత ఈసారి వర్తమాన అధికార పక్షాన్ని వ్యతిరేకిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జనాభా ఎక్కువగా వుంది. అయినా అన్ని రంగాల్లో బీసీలు వెనక్కి నెట్టి వెయ్యబడ్డారు. రాజకీయంగా అణచబడిన బీసీ వర్గం ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తే 'బీసీని ముఖ్యమంత్రిని చేస్తామ'ని ప్రకటించింది. ఇది సామాజిక న్యాయాన్ని అందించడానికి తీసుకున్న కీలక నిర్ణయంగా పేర్కొనవచ్చు. బీసీ సంఘాలు, బీసీల హక్కుల కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరూ బీజేపీ బీసీ సీఎం హామీకి మద్దతుగా ఉండాలి. గ్రామం, పట్టణం అనే భేదం లేకుండా యువత ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలి. ఎవరికి ఓటేస్తే ఏమి జరుగుతుందో స్పష్టం చేయాలి.

– జోగినపల్లి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ యువ నాయకులు

కడగండ్లు ఎందుకు తీరడం లేదు?

తెలంగాణలో ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ ఎన్నికల ప్రచారంలో అన్ని రాజకీయ పార్టీలూ సంక్షేమ పథకాల వాగ్దానాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్‌లతో హోరెత్తించాయి. అధికారం తమదే అనీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే భారీ మెజార్టీ తమకే వస్తుందనీ ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అంటున్నాయి. కానీ ప్రధాన పోటీ మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య కనిపిస్తున్నది. చివరికి ఈ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకి ఓటు వేయక తప్పదు. ఏదో ఒక పార్టీ గెలవక తప్పదు. ఎందుకంటే మనది ఎన్నికల ప్రజాస్వామ్యం కాబట్టి.

ప్రజాస్వామ్యమంటే ఎన్నికలనే ధోరణి మన సమాజంలో నాటుకుపోయింది. నిజానికి ఎన్నికలు ప్రజాస్వామ్యంలో ఒక భాగం మాత్రమే. ఇవాళ రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పరిధిలో ఏర్పడిన విషయాన్ని మర్చిపోతున్నాయి. తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.

ఈ దేశంలో పదేపదే ప్రజాస్వామ్యం ఎదురుదెబ్బలు తింటున్నప్పటికీ, ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారు. ఎందుకంటే అందులో ప్రజలకు మనుగడ ఉంది కాబట్టి. రాజకీయ పార్టీలకు అధికారం మీద ఉన్న మమకారం ప్రజా ప్రాతినిధ్యం మీదా, ప్రజల అభివృద్ధి మీదా ఉండడం లేదని చెప్పవచ్చు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్య పాలన చాలా విలువైనది. కానీ ప్రాతినిధ్య పాలనను మన రాజకీయ పార్టీలు ఎప్పుడో విస్మరించాయి. ప్రతి ఐదేళ్లకోసారి రాజకీయ పార్టీలు ఎన్నికలు పాల్గొనేది ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేయడం కోసం కాదనీ, అది కేవలం అధికారం కోసమేననీ చెప్పవచ్చు. నేడు అధికారమంటే ఆధిపత్యం చలాయించడం అయ్యింది. కానీ ప్రజాస్వామ్యంలో అధికారమంటే నిర్ణయం. అంటే ప్రజాభివృద్ధి కోసం నిర్ణయాధికారం కలిగి ఉండడం.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి మంచి ఉద్దేశాలు ఉంటే సరిపోవనీ, పటిష్ఠమైన వ్యవస్థలు ఉండాలనీ మన రాజ్యాంగం చెబుతుంది. కానీ మన రాజకీయ పార్టీలు ప్రభుత్వ వ్యవస్థలను నిత్యం నిర్లక్ష్యానికి గురిచేసి, నిర్వీర్యం చేస్తున్నాయి. ఆధునిక మనస్తత్వం లేనిదే ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడం గానీ, స్థిరపరచడం గానీ సాధ్యం కాదంటారు. మన రాజకీయ నాయకుల్లో ఆధునిక మనస్తత్వం కంటే అణచివేత మనస్తత్వమే ఎక్కువగా కనిపిస్తోంది.

ఇక సంక్షేమం విషయానికొస్తే 70 సంవత్సరాల నుంచి ప్రతిసారీ రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాల పేరు చెప్పి అధికారంలోకి వస్తున్నాయి. ఇక్కడ సంక్షేమం అంటే కాపాడడం. కాపాడుకోవడం! అంటే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను ఓటర్లుగా



కాపాడుకోవడం. ఓట్లు వేయించుకోవడం! అధికారంలోకి రావడం! ఇదంతా 70 ఏళ్ల నుంచి జరుగుతూ వస్తున్నదే. కానీ సంక్షేమ పథకాల కోసమో, ఆరు గ్యారంటీల కోసమో, బంగారు తెలంగాణ కోసమో మనం రాజ్యాంగం ఏర్పాటు చేసుకోలేదు. రాసుకోలేదు. సార్వభౌమాధికారం కోసం రాజ్యాంగం రాసుకున్నాం. సార్వభౌమాధికారాన్ని స్థాపించడం కోసం ప్రభుత్వం కావాలి. అందుకే మనకు మనం రాజ్యాంగాన్ని సమర్పించుకున్నాం. దానికి సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం వంటి లక్ష్యాలను ఏర్పరచుకొన్నాం. దీనికి ప్రాతిపదిక వ్యవస్థను స్థాపించడం కోసం రాజ్యాంగం రాసుకున్నాం. ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటున్నాం. ఆర్థిక, సాంఘిక అసమానతలూ, అవకాశాలు పొందడంలో అసమానతలూ ఇంకా ఉన్నాయి. వాటిని తొలగించాలి. వాటి స్థానంలో సమానత్వ లక్ష్యాన్ని సాధించాలి. సమానత్వాన్ని సాధించాలంటే మన రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉండాలి.

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి సంక్షేమ పథకాలతో పాటు ఒక భావజాలాన్ని కూడా తీసుకొస్తాయి. 'ఇందిరమ్మ రాజ్యం', 'బంగారు తెలంగాణ', 'రామరాజ్యం' వంటి భావనలు ఇందుకు ఉదాహరణలు. ఇప్పటి వరకు ఈ దేశంలో ఇందిరమ్మ, రామరాజ్యాలను చూశాము. అలాగే ఈ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, బంగారు తెలంగాణలను చూశాము. కానీ ఇంకా ఈ నేలలో దారిద్ర్యం, పేదరికం, నిరక్షరాస్యత, ఉపాధి లేని జీవితాలూ మిగిలే ఉన్నాయి. అణచివేత, హక్కుల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి.

ఉపాధి అవకాశాలు కొంతమందికే దక్కుతున్నాయి. అభివృద్ధి పేరుతో కొంతమంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. వీరికి న్యాయం జరగడం లేదు. భూముల ధరలు పెరగడం అభివృద్ధి అంటున్నారు. కానీ దీనివల్ల పేదవారు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఉత్పత్తి పెరిగింది అంటున్నారు. కానీ ధరలు మాత్రం తగ్గడం లేదు.

మా సంక్షేమ పథకాలు మమ్మల్ని మళ్లీ గెలిపిస్తాయని ప్రభుత్వ పెద్ద అంటుంటే, ప్రభుత్వంపై వ్యతిరేకతతో పాటు మా గ్యారెంటీలు మమ్మలను గెలిపిస్తాయని ప్రతిపక్షం నమ్ముతోంది. ఏం జరుగుతుందో చూడాలి. సమాజంలో ఆధునిక మార్పు రావాలంటే యువత భారీ సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే మార్పు సాధ్యమవుతుంది.

– ఎ. మల్లేష్, రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ ׀ 96038 70734

అసలైన సంతోషం

ఒక రాజు గారు తన దేశంలో సంతోషంగా, తృప్తిగా జీవిస్తున్న వ్యక్తి ధరించిన చొక్కా తీసుకురమ్మని భటులను పంపారు. అటువంటి వ్యక్తి కోసం వారు దేశమంతా గాలించారు. ఇల్లిల్లూ తిరిగారు. ప్రతి వ్యక్తి తనకు సమస్యలున్నాయనీ, తాను పూర్తి సంతోషంతో లేననీ చెప్పినవారే. భటులు విచారించిన వారిలో అత్యంత ధన సంపన్నులూ, విద్యావేత్తలూ, సామాన్యులూ...అన్ని రకాల వారు ఉన్నారు. భటులు అలా వెతుకుతూ వెతుకుతూ ఒక పూరి గుడిసె చూశారు. ఆ ఇంటిలోని వారితో మాట్లాడలేదని గుర్తించారు.



కాని, ఆ ఇల్లు చాలా శిథిలావస్థలో ఉంది. తలుపులు ముట్టుకుంటే పడిపోయేట్లు ఉన్నాయి. ఇంతవరకు తాము విచారించిన ఇంతమందిలో లేని తృప్తి, సంతోషం ఈ పేదింట్లో మాత్రం ఎలా ఉంటుంది? ఈ ఇంటిలోకి వెళ్ళటం, అడగటం కూడా అనవసరం అనుకున్నారు. కాని, ప్రతి ఒక్కరినీ కనుక్కోమని రాజాజ్ఞ! రాజుకు ఈ ఇంటిని వదిలేశామని తెలిస్తే తమకు శిక్ష తప్పదు. ఎందుకు అనవసరంగా సమస్య కొని తెచ్చుకోవటం అని వారు ఆ ఇంటిలోనికి వెళ్లారు. ఆ ఇంట్లో ఒక భార్య, భర్త ఉంటున్నారు. భర్త ఒంటి మీద చొక్కా లేదు. మాసిపోయిన పంచె కట్టుకుని ఉన్నాడు. భార్య కూడా ఒక సాదా చీర కట్టుకుని ఉంది. వారు ఆ సమయంలో గంజి తాగుతున్నారు.

వారి పరిస్థితి అర్థమవుతున్నా, భటులు వారిని 'మీరు సంతోషంగా తృప్తిగా జీవిస్తున్నారా? మీకేమైనా ఇబ్బందులున్నాయా?' అని అడిగారు. ఆ వ్యక్తి నవ్వుతూ 'మేము మాకున్నదానితో చాలా సంతోషంగా, తృప్తిగా ఉన్నాము. మాకేం అత్యాశలు లేవ'న్నారు. భటులు చాలా ఆశ్చర్యపోయారు. ఆ వ్యక్తి, 'మీరెవరు, ఎందుకలా అడిగారు?' అనడిగితే భటులు ఇది రాజాజ్ఞ అని చెప్పి, అతని చొక్కా ఒకటి ఇమ్మన్నారు. ఆ వ్యక్తి చిరుగులు పడిన పాత చొక్కా ఇస్తే అది తీసుకుని వెళ్ళిపోయారు.

ఇది కథే అయినా, అత్యాశకు పోకుండా, ఉన్న దానితో సంతోషంగా ఉంటూ, కష్టపడటంలోని ఆనందాన్ని అనుభవిస్తూ జీవించే వారు మన మధ్యా ఉంటారు. వారిదే నిజమైన సంతోషం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

సాక్షి జోగుళాంబ గద్వాల

బుధవారం, 29, నవంబర్, 2023



.. గోవింద నామస్మరణ

కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

వివరాలు 2లో ▸



మద్యం పట్టివేత

అక్రమంగా భారీ ఎత్తున మద్యం తరలిస్తున్న ఓ లారీని పోలీసులు పట్టుకున్నారు.

వివరాలు 2లో ▸



వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాల మూసివేత

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మద్యం దుకాణాలు, రెస్టారెంట్‌లను మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు మూసి వేశారు. ఈ సందర్భంగా సీఐ గోపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎలక్షన్ కమిషన్ యాదేశాల మేరకు మద్యం అమ్మకాలను నిషేధించామన్నారు. నవంబర్ 1వ తేది నుంచి నూతన మద్యం పాలసీ అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. మంగళవారం రాత్రి 7గంటల వరకు 1,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 87, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 645, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులతో కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1,597 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.462 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.8,180

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు మంగళవారం 3,314 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 8180, కనిష్టం రూ. 3716, సరాసరి రూ. 7400 ధరలు పలికాయి. అలాగే, 153 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ. 5540, కనిష్టం రూ. 3302, సరాసరి రూ. 5492 ధరలు వచ్చాయి. దీంతోపాటు 3959 క్వింటాళ్ళ వరి (సోన) రాగా గరిష్టం రూ.3021, కనిష్టం రూ. 1995, సరాసరి ధర రూ. 2951 ధరలు పలికాయి.

ఆర్‌ఎన్‌ఆర్ ధర రూ.2,931

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2, 931, కనిష్టంగా రూ.2,350గా ధరలు లభించాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ. 1,881, కనిష్టంగా రూ.1,789గా ధరలు వచ్చాయి. ఆముదాల ధర గరిష్టంగా రూ.5,200గా ఒకే ధర వచ్చింది. మార్కెట్‌కు దాదాపు 5 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన.. ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై వేటు పడింది. ఎక్సైజ్ శాఖలో మహబూబ్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ పరిధిలో పనిచేసే ఔట్ సోర్సింగ్ జూనియర్ అసిస్టెంట్ ఉషారాణి శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓ రాజకీయ పార్టీ తరఫున ప్రచారం చేశారు. దీనిని పరిగణలోకి తీసుకొని ఆమెను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సైదులు తెలిపారు.

రూ.3.51 కోట్ల మద్యం సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎక్సైజ్ పోలీసులు బెల్ట్ దుకాణాలతో పాటు ఇతర మద్యాన్ని అక్రమంగా సరఫరా చేయకుండా కట్టడి చేయడం జరిగింది. నెల రోజుల సమయంలో జిల్లావ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే 58 లీటర్ల మద్యం సీజ్ చేశారు. ఇక జిల్లాలో బెల్ట్ దుకాణాలతో పాటు ఎన్నికల కోసం తరలించే మద్యం ఐఎంఎల్ 3,531లీటర్లు, బీరు 623 లీటర్లు సీజ్ చేశారు. నాలుగు వాహనాలు సైతం సీజ్ చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.3.51కోట్లు ఉండటం విశేషం.

అంతా సైలెంట్..!

ముగిసిన ప్రచారం.. ఇక ప్రలోభాల పర్వం

- 40 రోజులుగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ క్యాంపెయిన్
- కారు, హస్తం అభ్యర్థుల మధ్య నువ్వా, నేనా అన్నట్లు పోటీ
- మహబూబ్‌నగర్, మక్తల్, కొల్లాపూర్, కల్వకుర్తిపై బీజేపీ ఆశలు
- ఉమ్మడి పాలమూరును హోరెత్తించిన ఆయా పార్టీల అగ్రనేతలు
- గంపగుత్త ఓట్లపై నేతల కన్ను.. కుల, మహిళా సంఘాల వారీగా గాలం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సార్వత్రిక ఎన్నికల ఘట్టం క్లైమాక్స్‌కు చేరింది. షెడ్యూల్ ప్రకారం ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ఉమ్మడి పాలమూరులోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు చివరి రోజు ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారంతో హోరెత్తించారు. మరోవైపు ప్రచార పర్వం ముగియగా.. ప్రలోభాల జాతరకు తెరలేచింది. రెండు, మూడు రోజులుగా గంపగుత్త ఓట్లపై కన్నేసిన అభ్యర్థులు పని కానిచ్చేస్తున్నారు. తమ తమ ముఖ్య సహచరులతో కలిసి కుల, మహిళా తదితర సంఘాల వారీగా గాలం వేస్తున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్: అగ్రనేతల ఆగమనం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగింది. ఉమ్మడి పాలమూరుకు చెందిన రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా నియామకమైన తర్వాత జిల్లాలో కాంగ్రెస్ పుంజుకోగా.. ఎన్నికల షెడ్యూల్, అభ్యర్థుల ప్రకటన అనంతరం పక్కా ప్రణాళికతో పోరు బాట పట్టింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ తదితర జాతీయస్థాయి నేతలు పలు నియోజకవర్గాల్లో పర్యటించగా.. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. కొల్లాపూర్, కల్వకుర్తి, జడ్చర్ల సభల్లో రాహుల్, గద్వాల, కొడంగల్‌లో ప్రియాంక, అలంపూర్, కల్వకుర్తిలో ఖర్గే, మక్తల్‌లో కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య, మహబూబ్‌నగర్‌లో జైరాం రమేష్ తదితర నేతలు ప్రచార సభల్లో పాల్గొన్నారు. అదేవిధంగా రేవంత్‌రెడ్డి అమ్మడి జిల్లాలోని అన్ని సెగ్మెంట్లలో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లో పాల్గొని బీఆర్‌ఎస్ సర్కారు తీరుపై దుమ్మెత్తిపోయడంతో పాటు మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు.

బీఆర్‌ఎస్ : కేసీఆర్ అన్నీ తానై..

ఎన్నికల షెడ్యూల్ నవంబర్ మూడో తేదీన విడుదల కాగా.. బీఆర్‌ఎస్ అంతకన్న ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది. షెడ్యూల్ కన్నా సుమారు నెల రోజుల ముందు నుంచే ఆ పార్టీ అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఉంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్ వద్ద ఒక మోటార్ స్విచ్ ఆన్ చేసి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా.. కేసీఆర్ అన్నీ తానై బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ఉమ్మడి పాలమూరులోని 14 నియోజకవర్గాలను చుట్టేశారు. ప్రజా ఆశీర్వాద సభలకు పెద్ద ఎత్తున పజలు హాజరుకాగా.. కేసీఆర్ పదునైన ప్రసంగాలతో ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేశారు. తన హయాంలో ఇంటింటికీ అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరిస్తూనే విపక్ష కాంగ్రెస్, బీజేపీలపై పదునైన విమర్శలు గుప్పించి.. మేనిఫెస్టోలోని అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలు ఆలోచించేలా చతురతను ప్రదర్శించారు. మరోవైపు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పలు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.

బీజేపీ: అతిరథుల 'పట్టు'

తెలంగాణలో పట్టు సాధించి, పాగా వేయాలనే లక్ష్యంతో బీజేపీ అతిరథులు పోటెత్తారు. షెడ్యూల్ కంటే ముందుగానే ఉమ్మడి పాలమూరు నుంచే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల శంఖారావం పూరించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం మళ్లీ అగ్రనేతల రాక మొదలైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ, అసోం సీఎంలు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వశర్మ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రులు మురళీధరన్, నారాయణ స్వామి, భగవంత్ కుబ, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌తోపాటు తరుణ్‌చుగ్, ఈటల రాజేందర్, బండి సంజయ్, రాజాసింగ్ సంకల్ప సభలు, రోడ్‌షోలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తో పాటు ఎంఐఎంపై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, మక్తల్, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాలపై ఆ పార్టీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

మద్యం, తాయిలాలలో ఎర..



ఎన్నికల ప్రచారం ముగియడంతో పార్టీల అభ్యర్థులు గంపగుత్తగా ఓట్లను పొందేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు డబ్బు, మద్యాన్ని ఎరవేస్తున్నారు. గ్రామాలు, వార్డులు, డివిజన్ల వారీగా ఇంచార్జీలను నియమించుకుని ఓటర్ల బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలను ఇప్పటికే మూసివేయగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే అన్నీ సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. పట్టణాలు, గ్రామాల్లో డబ్బు, మద్యం పంపిణీ నేపథ్యంలో రాజకీయ ప్రత్యర్థులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు సైతం చేసుకుంటున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గరపడటంతో చివరి నిమిషంలో ఓట్ల గాలింపు కోసం అభ్యర్థులు ప్రయత్నాలను సాగిస్తున్నారు.

INTERVIEW

ప్రజలే నా బలం.. బలగం

- మెడికల్, నర్సింగ్ కళాశాలలు, 300 పడకల ఆస్పత్రితో మెరుగైన వైద్యం చేరువ
- నిరుద్యోగ యువత ఇబ్బందులు తీర్చేందుకే స్టడీ సర్కిల్ ఏర్పాటు
- 'గట్టు' ఎత్తిపోతలతో బీడుభూములు సాగులోకి తెస్తా..
- పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించా
- ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారన్న నమ్మకం ఉంది
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సాక్షితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: 'ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత కరోనా కష్టకాలం మొదలు.. ప్రజల మధ్యే ఉండి వారికి సేవలందించా. ప్రజలే నా బలం.. బలగం. గద్వాలకు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశా. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలు అర్హులకు అందించా. అందుకే తాను ప్రచారం కోసం ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు, ఆదరణ లభించింది. అన్ని వర్గాల ప్రజల ఆదరణ నాకు ఉంది. గతంలో కంటే అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపించబోతున్నారు..' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయనతో 'సాక్షి' మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

శరవేగంగా 'గట్టు' పనులు

గద్వాల నియోజకవర్గంలో సాగునీరందని గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని బీడుభూములకు సాగునీటిని అందించేందుకు గట్టు ఎత్తిపోతల పథకాన్ని సాధించాం. త్వరలోనే ఆయకట్టుకు సాగునీటిని అందిస్తాం. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించేందుకు మిషన్‌భగీరథ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. గద్వాలకు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, 300 పడకల ఆస్పత్రి సాధించాం. త్వరలోనే నాణ్యమైన వైద్యం ప్రజలకు అందనుంది. మన ఊరు, మనబడి పథకం ద్వారా పాఠశాలలు వసతులు మెరుగుపర్చాం. రూ.వందల కోట్లతో గ్రామాలు, గద్వాల పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. అర్హులైన పేదలకు లక్కీడిప్ ద్వారా డబుల్‌బెడ్రూంలు కేటాయించాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెట్టెంపాడు ప్రాజెక్టు కింద ఏటా ద్వారా 1.40లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నాం.

బీఆర్‌ఎస్ గెలుపునకు అభివృద్ధే నాంది

ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ రెండు కూడా ఢిల్లీ పార్టీలు. పైగా ఆ ఇద్దరు అభ్యర్థులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించింది ఏమీ లేదు. వారి నుంచి పోటీ అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్, ఆసరాపింఛన్, పల్లెప్రగతి, పట్టణప్రగతి, ప్రకృతివనాలు, క్రీడామైదానాలు, వైకంఠధామాలు, రైతువేదికలు, గొర్రెలపథకం, మత్స్యకారులకు వంద శాతం రాయితీతో కూడిన చేపపిల్లల పంపిణీ, వాహనాల పంపిణీ, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు.. ఇలా గద్వాల నియోజకవర్గంలోని ప్రతిఇంటికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకం ఫలాలు అందాయి. ఈ అభివృద్ధే బీఆర్‌ఎస్ గెలుపునకు, నా విజయానికి నాందికానున్నాయి.

జీవితం ప్రజా సేవకే అంకితం

35 ఏళ్ల రాజకీయ జీవితంలో నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వస్తున్నా. రాజకీయ విభేదాలతో డీకే కుటుంబంతో విడిపోయిన తర్వాత ఒంటరిగా ప్రజలను నమ్ముకొని ముందడుగు వేశా. నా జీవితం ప్రజా సేవకే అంకితం. ఇతర వ్యాపకాలు, వ్యాపారాలు లేవు. 2009లో తొలిసారిగా.. 2014లో మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందా. అయినా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వచ్చా. ఇది గుర్తించిన ప్రజలు నన్ను 2018లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారు. ఇన్నేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, తాను చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగా. ప్రజల నుంచి మంచి ఆదరణ వచ్చింది.

నిరుద్యోగ యువతకు అండగా నిలిచా

గతంలో వివిధ రకాల ఉద్యోగ పోటీపరీక్షలలో కోచింగ్ కోసం ఇక్కడి విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి రూ.వేలకు వేలు ఖర్చు చేసేవారు ఎన్నో ఇబ్బందులు పడేవారు. నా సొంత ఖర్చులతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ స్టడీసర్కిల్‌ను ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులు, యువతకు ఉచితంగా కోచింగ్ అందించా. హైదరాబాద్ నుంచి ఉత్తమ అధ్యాపకులచే శిక్షణ ఇప్పించా. అందుకే కేసీఆర్ స్టడీసర్కిల్‌లో శిక్షణ పొందిన చాలా మంది యువతీ యువకులు పోలీసు, పంచాయతీరాజ్ వంటి ప్రభుత్వశాఖలలో ఉద్యోగాలు సాధించారు. గద్వాలలో రూ.5లకే కేసీఆర్ భోజన పథకాన్ని ప్రారంభించాను. తనవంతుగా ప్రజలకు సేవలిందిస్తూ ప్రజల కోసమే పనిచేస్తున్నా. నేను చేసిన సేవ, ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలే నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయి..' అని గద్వాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు.

పకడ్బందీగా ఎన్నికల సామగ్రి పంపిణీ



అలంపూర్‌లో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- జిల్లాలో 593 పోలింగ్ కేంద్రాలకు బృందాలు సిద్ధం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్/అలంపూర్: ఎన్నికల సామగ్రి పంపిణీ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. అలంపూర్ చౌరస్తాలోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 29 తేదిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సెక్టర్ల వారీగా పోలింగ్ స్టేషన్‌లకు ఈవీఎంలను పంపించాలని, జాబితా ప్రకారం ఈవీఎంలు సీరియల్ నెంబర్‌ల ప్రకారం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, పార్కింగ్, ర్యాంపులు, పోలింగ్ అధికారులకు కావాల్సిన భోజనాలు, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కేంద్రాలలో 100 శాతం వెబ్ క్యాస్టింగ్ ఉంటుందని పేర్కొన్నారు. వీరితోపాటు అలంపూర్ రిటర్నింగ్ అధికారి చంద్రకళ, ఎస్ డీసీ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ మంజుల, డిటీ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఈనెల 30వ తేదీవ జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బందిని మూడవవిడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం ఆమే ఐడీవోసీ కార్యాలయంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు పి.వసంత్‌కుమార్ సమక్షంలో మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. గద్వాల నియోజకవర్గంలో మొత్తం 303పోలింగ్ కేంద్రాలున్నాయని, ఇందుకుగాను 303టీంలను ఏరాపటు చేసినట్లు తెలిపారు. ఒక్కో టీంలో పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలు చొప్పున రిజర్వ్ సిబ్బందితో కలిపి మొత్తం 236మంది పోలింగ్ సిబ్బంది ఉంటారని తెలిపారు. అదేవిధంగా గద్వాల నియోజకవర్గ పరిధిలో మొత్తం 67సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలున్నట్లు ఇందుకోసం 71మంది మైక్రో పరిశీలకులను కెటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 290పోలింగ్ కేంద్రాలున్నాయని 290టీంలను ఏర్పాటు చేసి 226మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. అలంపూర్‌లో మొత్తం 68సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుండగా 73మందిని మైక్రో పరిశీలకులను కేటాయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, సీపీవో లక్ష్మణ్, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



నందిన్నె చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు సమీర్‌కుమార్‌ఝా

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉంచాలని ఎన్నికల పరిశీలకులు సమీర్‌కుమార్‌ఝా అన్నారు. మంగళవారం ఆయన గట్టు మండలం బలిగెర, నందిన్నె, ఎర్రవల్లి, బీచుపల్లి చెక్‌పోస్టులను సందర్శించి తనిఖీ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- పోలింగ్‌కు 1200మందితో భద్రత
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్



మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికలను రెండు సెగ్మెంట్‌లలో స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహిస్తామని ఎస్పీ రితిరాజ్ అన్నారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. గద్వాల – అలంపూర్ ఎన్నికల నిర్వహణలో కేంద్ర, కర్ణాటక, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో ఎప్పటికప్పుడు నివేదికలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్, స్ట్రయికింగ్ ఫోర్సు, ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపామన్నారు. జిల్లా వ్యాప్తంగా 593 పోలింగ్ కేంద్రాలు, 65 రూట్లకుగాను సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలతో భద్రతా చర్యలు చేపట్టామన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 1వ తేది ఉదయం ఏడు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, 30న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద 100 మీటర్ల దూరంలో నిబంధనలు అమల్లో ఉంటాయని, ఏ పార్టీకి చెందిన వారు సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

చివరి రోజు హోరాహోరీ ప్రచారం



గద్వాలలో బీఆర్‌ఎస్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్/గద్వాల అర్బన్: అసెంబ్లీ ఎన్నికల ఘట్టంలో ముఖ్యమైన ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం 5గంటలతో ముగిసింది. దీంతో మంగళవారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు రోడ్‌షోలు, ర్యాలీలతో హోరెత్తించారు. మొదటగా జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కిష్టారెడ్డిబంగ్లా నుంచి మైదలైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా కొనసాగింది. నాయకులు వేలాదిగా తరలిరావడంతో పట్టణం గులాబీమయమైంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఢిల్లీ పార్టీలని, బీఆర్‌ఎస్ గల్లీ పార్టీ అని, బీఆర్‌ఎస్‌ను ఓటేసి గెలిపించాలని కోరారు. 50 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జీవితాలను ఆగం చేసిందని, ఆ పార్టీ హయాంలో మొత్తం స్కాములమయంగా సాగిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.16వేలు, ఆసరా పింఛను రూ.5వేలు, రూ.500 గ్యాస్‌సిలిండర్‌వంటి పథకాలతో పాటు, అసైన్డ్‌భూములకు యాజమాన్యహక్కు పట్టాలిస్తామన్నారు.

■ బీజేపీ అభ్యర్థి బోయ శివారెడ్డి తరుపున ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఆధ్వర్యంలో పట్టణంలోని దరూరు మెట్టు నుంచి బైక్ ర్యాలీని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు జీరో అని, అవి కేవలం ప్రజలను మోసం చేసేందుకేనని, బీఆర్‌ఎస్ పార్టీ నమ్మినందుకు రాష్ట్రాన్ని లూటీ చేశారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ విమర్శించారు.

■ కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఆధ్వర్యంలో ఆమె క్యాంపు కార్యాలయం నుంచి రోడ్‌షో నిర్వహించారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుందామని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలతో పాటు 66మ్యానిఫెస్టో సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. బీసీ బిడ్డగా కాంగ్రెస్ తరుపున ఆశీర్వాదించాలన్నారు.

ఆత్మగౌరవాన్ని కొనలేరు



మద్దూరు కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మద్దూరు: రేవంత్‌రెడ్డి సీట్లు అమ్ముకున్న డబ్బులతో ఇక్కడి నాయకులను కొనుగోలు చేశాడేమోగానీ.. ఆ డబ్బు సంచులతో కొడంగల్ ప్రజల ఆత్మగౌరవాన్ని కొనలేడని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెంటికి చెడ్డ రేవడిలా అటు కామారెడ్డిలో మూడోస్థానం, కొడంగల్‌లో ఓడిపోబోతున్నాడని.. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో 30 స్థానాల్లో అభ్యర్థులే లేరని.. ఇక ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దూరులో మంత్రి హరీశ్‌రావు, గనులు, భూగర్భ శాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి మద్దూరు కొత్తబస్టాండ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని కొడంగల్ ప్రజలు రెండు సార్లు గెలిపించగా.. ఆయన అందుబాటులో లేకుండా పోయాడని గుర్తుచేశారు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి అని అందుకే ఇప్పటి వరకు మోదీని ఒక్కసారి కూడా విమర్శించలేదని, కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు నరేందర్‌రెడ్డిని గెలిపించి చరిత్ర తిరగరాసి అభివృద్ధిని చూశారని, ఈసారి కూడా అత్యధిక మెజార్టీతో మళ్లీ పట్నం నరేందర్‌రెడ్డి గెలిపించాలని, పట్నంకు ప్రమోషన్ ఇస్తామని అన్నారు.

కర్ణాటకలోనే 'గ్యారంటీలు' అమలు చేయలే..

ఆర్నెళ్ల క్రితం కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారంలోకి తీసుకొస్తే ఇచ్చిన 5 గ్యారంటీలను అమలు చేయలేదని, కావాలంటే మీ ఆ రాష్ట్రంలో ఉన్న మీ బంధువులను అడిగి తెలుసుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంట్ ఇస్తే చాలని అంటున్నాడని.. ఇది సరిపోతుందా అని రైతులను ప్రశ్నించారు. అక్కడ 2.5 లక్షల ఉద్యోగాలు 100 రోజుల్లో ఇస్తానని ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ వేయలేదని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే పింఛన్ రూ.5 వేల వరకు పెంపు, సన్నబియ్యం, ఎకరాకు రూ.16 వేల రైతు బంధు, బీమా అమలు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు.

'పాలమూరు' ద్వారా 1.45లక్షల ఎకరాలకు సాగునీరు

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఏడాది, రెండేళ్లలోపే కొడంగల్ నియోజకవర్గంలోని లక్షా 45 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. చంద్రకల్ వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు.



ఈవీఎం ధరెంతో తెలుసా..

దేశంలో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం) డిజైన్ చేసిన వ్యక్తిగా హనీఫా గుర్తింపు పొందారు. ఎం-2 ఈవీఎం ధర మార్కెట్‌లో సుమారు రూ.8,670 ఉండగా.. ఎం-3 రకం ధర రూ.17వేలు ఉంటుంది. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించడం వల్ల సుమారు 10వేల మెట్రిక్ టన్నుల కాగితం మిగిలిందని ఎన్నికల సంఘం అధికారులు తమ నివేదికలో పేర్కొనడం విశేషం. - కల్వకుర్తి టౌన్

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



కోడేరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా
- అన్ని కేంద్రాలను జియోట్యాగింగ్ చేసిన అధికారులు
- అధికారులకు సులభం కానున్న పర్యవేక్షణ
- ఉమ్మడి జిల్లాలో 3,621 పోలింగ్ కేంద్రాలు

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఈసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ సిబ్బందితో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర యంత్రాంగం విధుల్లో నిమగ్నమైంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు స్లిప్‌లు, గుర్తింపు కార్డుల పంపిణీ చివరి దశకు చేరగా.. పోలింగ్ సమీపిస్తున్న వేళ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే అన్ని పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేశారు. ఇందుకోసం లాంగిట్యూడ్, లాటిట్యూడ్ ప్రక్రియ పూర్తయింది. తద్వారా రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా అధికారులు పోలింగ్ సరళిని పరిశీలించే వెసులుబాటు కలగనుంది. పోలింగ్ కేంద్రం ఆవరణలో ఏవైనా అనుకోని సంఘటనలు, గొడవలు జరిగితే రాష్ట్ర, జిల్లా స్థాయిలో తక్షణమే గుర్తించి నష్టనివారణ చర్యలు చేపట్టనున్నారు.

రంగంలోకి అదనపు బలగాలు

పోలింగ్ గురువారం నిర్వహించనున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ ముందుచూపుతో వ్యవహరిస్తోంది. సున్నితమైన ప్రాంతాలు, అత్యంత సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించారు. అలాగే జిల్లాలకు చేరుకున్న ప్రత్యేక బలగాలతో ఆయా ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించేలా కవాతు నిర్వహించారు. గత ఎన్నికల సమయాన ఎక్కడెక్కడ పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు జరిగాయో గుర్తించి.. ఆయా కేంద్రాలకు ఆదనపు బలగాలను రంగంలోకి దించాలని నిర్ణయించారు.

పాతనేరస్తుల బైండోవర్..

అన్ని పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయడంతో పాటుగా ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న పాత నేరస్తులు, హిస్టరీ షీట్స్ ఉన్న వ్యక్తులు, నియోజకవర్గ పరిధిలో ఉన్న పాత నేరస్తుల అందరినీ బైండోవర్ చేస్తున్నారు. కొత్తగా వారిపై ఏమైనా కేసులు నమోదయ్యాయా? ఎక్కడెక్కడకు వెళ్తున్నారు? ఎవరిని కలుస్తున్నారనే అంశంపై నిఘా పెంచారు.

సీసీ కెమెరాలు కూడా..

ఎన్నికల సందర్భంగా పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తుతో పాటు పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేస్తోంది. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించనున్నారు. పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేశాక మండల పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. తద్వారా పోలింగ్ సరళిని ఇటు జిల్లా, అటు రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
మహబూబ్‌నగర్	272
జడ్చర్ల	274
దేవరకద్ర	289
వనపర్తి	296
నాగర్‌కర్నూల్	259
అచ్చంపేట	274
కొల్లాపూర్	269
గద్వాల	303
అలంపూర్	290
నారాయణపేట	270
మక్తల్	284
కొడంగల్	279
కల్వకుర్తి	262
మొత్తం	3,621

వీవీ ప్యాట్‌తో జాగ్రత్త!



కల్వకుర్తి టౌన్: ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత కోసం ఎన్నికల సంఘం వీవీ ప్యాట్‌లను ప్రవేశపెట్టింది. ఈవీఎంలో వేసే ఓటు మరెవరికో నమోదవుతోందని ఆరోపణలు రావడంతో వీవీ ప్యాట్‌లను పరిచయం చేసింది. ఈవీఎంలో ఓటేసిన ప్రతి వ్యక్తి ఆ పక్కనే అమర్చిన వీవీప్యాట్‌లో తన ఓటు సరిగ్గా నమోదైనది లేనిదీ ఏడు సెకన్ల పాటు చూసే ఏర్పాట్లు చేసింది. పూర్తిగా పరీక్షించాకే ఈ పరికరాన్ని ఎన్నికల కమిషన్ వినియోగంలోకి తీసుకొచ్చింది.

అబద్ధాలు ఆడితే జైలుకే..

వీవీ ప్యాట్‌లను ఇంత పకడ్బందీగా ఏర్పాటు చేసినా.. ఎవరైనా ఓటరు తన ఓటు మరో అభ్యర్థి ఖాతాలో నమోదయిందని అభ్యంతరం చెప్పవచ్చు. ఆ అభ్యంతరం తప్పని తేలితే కఠిన చర్యలుంటాయని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఒకటికి రెండుసార్లు ఆ ఓటరుకు వివరిస్తారు. అధికారి వాదనను బలపర్చకుంటే సదరు వ్యక్తి నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుంటారు. ఓటింగ్ కాసేపు ఆపి ఏజెంట్ల సమక్షంలో మరోమారు ఓటు వేయమని కోరుతారు. అప్పుడు ఫిర్యాదు దారుడి ఆరోపణ తప్పని తేలితే సదరు వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు అందించిన పుస్తకంలో ఈ విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. అందువల్ల వీవీప్యాట్ విషయమై అబద్ధాలు ఆడితే జైలుకే అన్న విషయాన్ని ప్రతి ఓటరు తెలుసుకోవాలి.

వీరి రికార్డులు బ్రేక్ అయ్యేనా!

- ఆరుసార్లు ఎమ్మెల్యేగా నాగం గెలుపు
- 5సార్లు మహేంద్రనాథ్, కృష్ణారావు, శంకర్‌రావు, గురునాథ్‌రెడ్డి
- 4 సార్లు సమరసింహారెడ్డి, జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, చిన్నారెడ్డి

జడ్చర్ల టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు అత్యధికంగా శాసనసభ్యుడిగా గెలుపొందిన వారి వివరాలు తెలుసుకుందాం. నాగర్‌కర్నూలు నియోజకవర్గం నుంచి నాగం జనార్దన్‌రెడ్డి ఇప్పటి వరకు ఆరుసార్లు గెలుపొందారు. ఆయన తర్వాత మరెవ్వరు సాధించలేదంటే అతిశయోక్తి లేదు. ఆ తర్వాత అచ్చంపేట నుంచి దివంగత పీ.మహేంద్రనాథ్, కొల్లాపూర్ నుంచి జూపల్లి కృష్ణారావు, షాద్‌నగర్ పీ.శంకర్‌రావు, కొడంగల్‌రావుల గురునాథ్‌రెడ్డి ఐదు సార్లు గెలుపొందగా, డీకే.సమరసింహారెడ్డి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి, జిల్లెల చిన్నారెడ్డి నాలుగు సార్లు గెలుపొంది రికార్డుల్లో నిలిచారు. అయితే ఇప్పుడు జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో కొల్లాపూర్ నుంచి జూపల్లి కృష్ణారావు పోటీ చేస్తుండటంతో ఆయన గెలిస్తే ఆరుసార్లు అసెంబ్లీకి వెళ్లిన నాగం రికార్డును సమం చేసే అవకాశాలు ఉన్నాయి.



⇨ నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి 14సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఒక ఉప ఎన్నిక. ఈ నియోజకవర్గం నుంచి 1985, 1994, 1999, 2004, 2009లో వరుసగా నాగం జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. 2012లోనూ ఉప ఎన్నికలో ఆయన ఆరోసారి విజయం సాధించి నియోజకవర్గంలో రికార్డు నెలకొల్పారు.

⇨ అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన దివంగత పీ.మహేంద్రనాథ్ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1962లో తొలిసారిగా ఆయన నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి గెలుపొందగా ఆ తర్వాత అచ్చంపేట నుంచి 1967, 1972, 1983, 1985లో విజయం సాధించారు.



⇨ కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి జూపల్లి కృష్ణారావు ఐదు పర్యాయాలు గెలుపొందారు. 1999, 2004, 2009, 2012, 2014 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఇందులో 2012 ఉప ఎన్నిక ఉంది.



⇨ గద్వాల నియోజకవర్గం నుంచి డీకే.సమరసింహారెడ్డి సైతం నాలుగు సార్లు విజయం సాధించారు. ఆయన 1980, 1983, 1985, 1989లో గెలుపొంది శాసనసభకు వెళ్లారు.



⇨ షాద్‌నగర్ నుంచి పీ.శంకర్‌రావు సైతం ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇందులో నాలుగు పర్యాయాలు 1983, 1989, 1999, 2004లో షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి, ఐదవసారి సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.



⇨ కల్వకుర్తి నియోజకవర్గం నుంచి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి వరుసగా నాలుగుసార్లు గెలుపొందారు. 1969, 1972, 1978, 1983లో ఆయన గెలుపొంది రికార్డు నెలకొల్పారు. ఆ తర్వాత ఆయన పార్లమెంట్ సభ్యుడిగా విజయం సాధించారు.



⇨ కొడంగల్ నియోజకవర్గం నుంచి రావులపల్లి గురునాథ్‌రెడ్డి ఐదు సార్లు గెలుపొందారు. 1978, 1983, 1989, 1999, 2004లో ఆయన విజయం సాధించారు.

⇨ మహబూబ్‌నగర్‌కు చెందిన పీ.చంద్రశేఖర్ సైతం నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన 1983, 1985, 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు.



⇨ వనపర్తి నియోజకవర్గం నుంచి జిల్లెల చిన్నారెడ్డి సైతం నాలుగు సార్లు గెలుపొందారు. 1989, 1999, 2004, 2014 ఏడాదిల్లో ఆయన గెలుపొంది శాసనసభకు వెళ్లారు.

⇨ ఇక వీరితోపాటు మూడుపర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన వారి సంఖ్య బాగానే ఉంది. వారిలో గద్వాల నుంచి డీకే అరుణ, అలంపూర్ నియోజకవర్గం నుంచి రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, కొల్లాపూర్ నుంచి కొత్త వెంకటేశ్వరరావు హ్యాట్రిక్ విజయాలు సాధించారు. జడ్చర్ల నుంచి ఎర్రశేఖర్, డా.లక్ష్మారెడ్డి సైతం మూడుసార్లు గెలుపొందారు.

ఓటర్లూ.. ఇవి తెలుసుకోండి



కల్వకుర్తి టౌన్: అసెంబ్లీ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఓటరు జాబితాను సిద్ధం చేశారు. పోలింగ్‌కు ముందు ఓటర్లు కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

- ఓటరు జాబితాలో పేరు ఉందా అనే విషయాన్ని పరిశీలించుకోవాలి. సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో లేదా స్థానికంగా ఓటరు నమోదు కేంద్రంలో పరిశీలించుకోవచ్చు.
- ఓటరు గుర్తింపు కార్డు, ఇతర ఫొటో గుర్తింపు కార్డు, ఓటరు చీటి మీ వద్ద ఉంచుకోవాలి.
- మీ ఇంటి వద్దకే బూత్‌స్థాయి అధికారి వచ్చి ఓటరు చీటి ఇచ్చి వెళ్తారు.
- ఒకవేళ ఓటరు చీటి ఇవ్వకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉండే రాజకీయ పార్టీల ఏజెంట్ల వద్ద పొందవచ్చు.
- పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు చీటి, గుర్తింపు కార్డును చూపించాలి.
- పోలింగ్ అధికారుల్లో ఒకరు ఓటరు జాబితాలో గుర్తింపుకార్డుతో పాటు మీ పేరును పరిశీలిస్తారు. మరో అధికారి మీ వేలికి సిరా చుక్క అంటిస్తారు. ఆ తర్వాత ఒక చీటి ఇస్తారు.
- మూడో అధికారి ఆ చీటిని పరిశీలిస్తారు.
- ఆ తర్వాత ఈవీఎంపై మీరు ఎన్నుకోవాల్సిన అభ్యర్థికి కేటాయించిన బటన్‌పై నొక్కాలి.
- మీరు ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో నిర్ధారణ చేసుకోవచ్చు.
- సీల్డ్ బాక్స్‌లోని గ్లాస్ కేసులో అది మనకు ఏడు సెకన్ల పాటు కనిపిస్తుంది.

ప్రలోభాలకు లొంగమని అమ్మానాన్నలతో హామీ



'మేమంటే మీకు ఎంతో ఇష్టం.. మీరంటే మాకు చాలా ఇష్టం.. మా కోసం మీరు పడే శ్రమ ఎంతో విలువైంది. ఈ ఎన్నికల్లో మీరు వేసే ఓటు మరెంతో విలువైంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, మద్యం, డబ్బుకు ఆశ పడకుండా దేశ భవిష్యత్‌లో మా భవిత ఉందని గుర్తించి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి.' అని నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హామీపత్రం రాయించుకున్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హామీ పత్రాలను ప్రదర్శించారు. - కోస్గి

యువకుడి ఖాతాలో రూ.50 వేలు మాయం

ఉప్పునుంతల: పోలీసులు సైబర్ నేరాలపై ఎంత అవగాహన కల్పిస్తున్నా.. కొంతమంది నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతూనే ఉన్నారు. ఇటీవల మండలంలో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని నమ్మించి ఓ యువకుడి బ్యాంక్ ఖాతాలో నుంచి రూ.50 వేలు కొట్టేసిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గురుస్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడూరుకి చెందిన రాసమల్ల మహేష్‌కి ఈ నెల 25న బ్యాంక్ అధికారుల పేరిట మీ ఏటీఎం కార్డు బ్లాక్ అయ్యిందని ఓ ఫోన్ కాల్ వచ్చింది. కార్డును పునరుద్ధరించడానికి మీ ఏటీఎం కార్డుపై ఉన్న నంబర్లను చెప్పాలని సూచించారు. అది నిజమని నమ్మిన యువకుడు వారు అడిగిన విధంగా తన ఏటీఎం కార్డుపై నంబర్లతో పాటు ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నంబర్‌ను చెప్పగానే.. ఖాతాలోని రూ.25 వేలు విత్‌డ్రా అయ్యాయి. దాంతో యువకుడు వారికి ఫోన్‌చేసి తన ఖాతాలోని డబ్బులు డ్రా అయిన విషయంపై అడుగగా మరో రూ.25 వేలు ఖాతాలో జమచేస్తే సాయంత్రం వరకు మొత్తం రూ.50 వేలు ఖాతాలోకి వస్తాయని నమ్మించారు. దాంతో యువకుడు మరో రూ.25 వేలు జమ చేయడంతో అవి కూడా నేరగాళ్లు విత్‌డ్రా చేసుకున్నారు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. దాంతో తాను మోసపోయినట్లు గ్రహించిన యువకుడు సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత మంగళవారం స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కీచక ఉపాధ్యాయుడు

- విద్యార్థినులతో వెకిలి చేష్టలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

గద్వాల క్రైం: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ఉపాధ్యాయుడు వెకిలి చేష్టలకు తెర తీశాడు. అభం శుభం తెలియని విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించి తన పైశాచికత్వం ప్రదర్శించాడు. భయాందోళనకు గురైన విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రులు, పోలీసుల వివరాల మేరకు.. గద్వాల మండలం అనంతపురం ప్రాథమిక పాఠశాలలో జిల్లా కేంద్రానికి చెందిన వై.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా పాఠశాల విద్యార్థినులతో అతడు అసభ్యంగా ప్రవర్తిస్తూ వస్తున్నాడు. మంగళవారం 5వ తరగతి విద్యార్థినులతో వెకిలి చేష్టలకు పాల్పడటంతో భయాందోళనకు గురయ్యారు. కొందరు విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిని నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై డీఈఓ, ఎంఈఓలు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. కాగా ఉపాధ్యాయుడి తీరుపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మహమ్మదాబాద్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కుల్కచర్ల మండలం చెల్లాపూర్‌కు చెందిన భీమమ్మ (55) ఈనెల 26న ఇంటి నుంచి బయటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం పెద్దవార్వాల్ గ్రామ శివారులోని కటికె కిషన్ వ్యవసాయ పొలంలో శవమై కనిపించింది. బంధువుల ఇంటికి వెళ్తూ వేరుశనగ పంటకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

మక్తల్: రోడ్డు ప్రమాదంలో కంటెయినర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన మక్తల్ మండలం బొందల్‌కుంట స్టేజీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. భీమవరం నుంచి గోవాకు చేపల లోడ్‌తో వెళ్తున్న కంటెయినర్.. బొందల్‌కుంట స్టేజీ సమీపంలో ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. కంటెయినర్ క్యాబిన్‌లో డ్రైవర్ దినేష్ (45), మరో వ్యక్తి మగవత్ ఇరుక్కుపోగా, పోలీసులు క్రేన్ సహాయంతో బయటికి తీశారు. వారిద్దరిని 108లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే డ్రైవర్ దినేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మగవత్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..

ఎర్రవల్లిచౌరస్తా: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల మండలం కొండేరులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ బాబు వివరాల మేరకు.. కొండేరుకు చెందిన తెలుగు శ్రీను (40) చేపల వేట కోసం గ్రామ సమీపంలోని బావికి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు అతడి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి సోదరుడు బీచుపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నర్వ: నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని లంకాల్‌కు చెందిన ఓ బాలుడు నీటి సంపులో పడి మృతి చెందాడు. ఈ ఘటన ధన్వాడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లంకాల్‌కు గ్రామానికి చెందిన కుర్వ నర్సింహులు, లావణ్య దంపతులకు కుమారుడు అభి (3), రెండేళ్ల పాప ఉన్నారు. వీరు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లేటప్పుడు అభిని అమ్మమ్మ ఊరైన ధన్వాడలో వదిలిపెట్టగా.. సోమవారం సాయంత్రం అమ్మమ్మ ఇంటి ఆవరణలో ఆడుకుంటూ నీటి సంపులో పడ్డాడు. కుటుంబ సభ్యులు బాలుడి కోసం గాలించగా, నీటి సంపులో శవమై కనిపించాడు. మంగళవారం బాలుడి పార్థివదేహాన్ని లంకాల్‌కు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడి ఆత్మహత్య

రాజాపూర్: అనారోగ్యం, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాజాపూర్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కుచ్చర్‌కల్‌కు చెందిన బాంద్ర గణేష్ (28)కు ఆరునెలల కిందట వివాహమైంది. అతడికి అప్పుడప్పుడు సొమ్మ వచ్చేది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో పాటు భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురై సోమవారం ఆత్మహత్యకు యత్నించగా కొందరు అడ్డుకున్నారు. మంగళవారం రాజాపూర్ శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాలకు మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. కొండపై అలువేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఉద్దాలను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కొండ దిగువన దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో జాతర మైదానం కిటకిటలాడింది. తినుబండారాలు, ఆట వస్తువులు, గాజుల దుకాణాల్లో రద్దీ కనిపించింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



జాతర మైదానంలో భక్తుల రద్దీ

స్వామికి అలంకారం పొడిగింపు

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి ఆభరణాల తొలిగింపు గడువును పొడిగించినట్లు ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. భక్తులు, వ్యాపారుల విజ్ఞప్తి మేరకు ఈనెల 29న తొలగించాల్సిన ఆభరణాలను డిసెంబర్ 4న తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

భారీగా మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం కాటన్లతో పోలీసులు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల సమీపంలో మద్యం తరలిస్తున్న లారీని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. లారీలో మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎఫ్ఎస్‌టీ, ఎక్సైజ్ అధికారులు ఉమ్మడిగా లారీని వెంబడించి పట్టుకున్నారు. లారీలో గన్నీ బ్యాగ్స్ చాటున దాదాపు రూ.16లక్షల 53వేల విలువగల 170 కాటన్ల మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఖిల్లాఘనపూర్ మండలం నుంచి పెద్దమందడికి మద్యం తరలిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా గట్లఖానాపూర్‌లో అక్రమంగా మద్యం నిల్వ చేశారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా, పిడుగు నాగేంద్రం ఇంట్లో 12 కాటన్లు, శేఖర్ ఇంట్లో ఒక కాటన్ మద్యం లభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: ప్రతి ఇంటికీ ప్రభుత్వం సంక్షేమ పథకం అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా లబ్ధిదారులకు అందేవిధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగానికి 24గంటల ఉచిత విద్యుత్, రైతులకు సాగు పెట్టుబడి కోసం రైతుబంధు, రైతు బీమాతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ఎంపీపీ పెద్ద వీరన్న, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి, చక్రాధర్‌రెడ్డి, సత్యారెడ్డి, సీతారామిరెడ్డి, నరేందర్, రమేష్‌రెడ్డి, మధు, చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తిమ్మరాజు, రవి, మధు, సవారన్న పాల్గొన్నారు.


ఎల్కూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


యల్లందొడ్డిలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ బాసు శ్యామల

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

గట్టు: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ బాసు శ్యామల తెలిపారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా యల్లందొడ్డి, తారాపురం, జోకన్‌గట్టు గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

సమగ్ర అభివృద్ధియే నా లక్ష్యం

● బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల మాటలు నమ్మొద్దు
● కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తుమ్మిళ్ల రిజర్వాయర్లకు నిధులు
● విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు తొలి ప్రాధాన్యత

అలంపూర్ సమగ్ర అభివృద్ధియే నా లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఏ సంపత్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థితో 'సాక్షి' ఇంటర్వ్యూ..

- 'సాక్షి' అలంపూర్


'సాక్షి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్

ప్ర : ఎన్నికల ప్రచారం ఎలా జరిగింది?

జ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి హామీ ప్రజలకు తెలియజేశాం. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో, వార్డుల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించాం.

ప్ర : ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది.

జ : ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. యువకులు, నిరుద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారు. ఊహించని విధంగా ప్రజల నుంచి స్పందన వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమకు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. అందుకే ఏ గ్రామానికి, పట్టణానికి వెళ్లిన ప్రజల నుంచి మద్దతు లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారానికి మద్దతుగా నిలిచారు.

ప్ర : ప్రజలు మీ ముందుకు తీసుకొచ్చిన ప్రధాన సమస్యలేమిటి?

జ : వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ప్రజలు సాగు నీటి సమస్య వివరించారు. సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, ఆర్టీసీ బస్సు సౌకర్యం, యువత ఉద్యోగ, ఉపాధి, కొత్త రేషన్ కార్డులు కావాలని, కొత్త పింఛన్‌లు, పాఠశాలల్లో సౌకర్యాలు, ఇళ్ల నిర్మాణాలు వంటి సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారు.

ప్ర : సాగునీటి సమస్యల పరిష్కారానికి మీ ప్రణాళికలు.

జ : అలంపూర్ నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఆర్డీఎస్ ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో నీటి వసతి లేదు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నా హయాంలో వచ్చింది. కానీ ఈ పథకం ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించడానికి మూడు రిజర్వాయర్ల నిర్మాణం జరగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్షణమే వంద రోజుల్లో నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తాం. పెండింగ్‌లో ఉన్న నెట్టంపాడు, చిన్నోనిపల్లి పనులు పూర్తి చేసి సాగు నీటిని అందిస్తాం.

ప్ర : పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంపై మీ అభిప్రాయం.

జ : ప్రజా పాలన అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. నిరుద్యోగం పెరిగింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేదు. రైతులకు రైతుబంధు పేరిట మోసం చేసి సబ్సిడీ, డ్రిప్ వంటివి ఎకరాకు రూ. 50 వేల వరకు కోత విధించింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాట్లాడటం, ప్రశ్నించడం తప్పుగా మారింది. అవినీతి, అక్రమాలు పెరగడంతో రాష్ట్రం అధోగతిపాలైంది. సామాన్యుడు బతకడానికి కావాల్సిన నిత్యవసర ధరలు సైతం అందుబాటులోకి లేకుండాపోయాయి.

ప్ర : మీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు?

జ : ఈ ప్రాంతంలో నేను ఎమ్మెల్యేగా పనిచేశా. అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటికి ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించడానికి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం సాధించడం జరిగింది. నా జీవితంలో ఇది మర్చిపోలేనిది. అంతర్రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణం, గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, ఎస్సీ, బీసీ రెసిడెన్సియల్ పాఠశాలలు తీసుకొచ్చాను. ఆర్టీసీ మినీ డిపో తీసుకొచ్చి శంకుస్థాపన చేసినప్పటికీ ప్రభుత్వం దాన్ని పూర్తిస్థాయిలో నిర్మించలేదు. ఈ ప్రాంత అభివృద్ధికి అనేక ప్రతిపాదనలు చేసిన అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పట్టించుకోలేదు.

ప్ర : ఆలయాల అభివృద్ధిపై మీ స్పందన?

జ : దేశంలోని ఉన్న 18 శక్తిపీఠాల్లో అలంపూర్‌లో ఐదో శక్తిపీఠం. ఈ క్షేత్రంలో శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి కొలువై ఉన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలో ఆశించిన స్థాయిలో జరగలేదు. పుష్కరాలకు వచ్చిన కేసీఆర్ వంద కోట్లు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాల సమగ్ర అభివృద్ధి చేస్తాం. దేవదాయ, కేంద్ర పురావస్తు శాఖలతో సమన్వయం చేసి వసతుల కల్పకు కృషి చేస్తాం.

ప్ర : కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజల స్పందన?

జ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజల నుంచి ఊహించని స్పందన వచ్చింది. ఆరు గ్యారంటీల రూపకల్పనలో నేను భాగస్వామిగా ఉన్నా. నేను భాగస్వామిగా ఉన్న ఈ పథకాలు ప్రజలకు చేరువకావడంతో ఎంతో సంతోషంగా ఉంది. ప్రజలు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారు.

ప్ర : ప్రజలకు మీరిచ్చే హామీలు ఏమిటి?

జ : రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ ప్రాంతంలో ప్రజల అవసరాలు పెరిగాయి. ప్రధానంగా రవాణా వ్యవస్థ అధ్వానంగా ఉంది. రోడ్ల నిర్మాణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం. నిరుద్యోగులకు జీవనోపాధి, ఆర్టీసీ బస్‌డిపో, డిగ్రీ కళాశాల, ఇటిక్యాల, రాజోలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సాగు నీటికి రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాలు, మెరుగైన వైద్యం వంటి ప్రధాన సమస్యలను పరిష్కరిస్తాం.

ప్ర : ప్రజలకు మీరేం చెబుతారు?

జ : బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. వాల్మీకులకు, మైనార్టీలకు ఇచ్చిన హామీలను విస్మరించింది. ఆ సమస్యలను కాంగ్రెస్ పరిష్కరిస్తుంది. కుర్వ గొల్లలకు గొర్రెలను పంపిణీ చేసి సంతృప్తి పర్చడానికి ప్రయత్నించింది. కాంగ్రెస్ శాశ్వత పరిష్కారం చూపుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బీఆర్ఎస్ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ప్రలోభపెట్టడానికి యత్నిస్తోంది. ఎన్నికల ద్వారా ఒక మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం మీ చేతిలో ఉంది. ఆలోచించి నిర్ణయం తీసుకోని ఓటు వేయాలి. కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న నన్ను గెలిపిస్తే ఎలాంటి అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా పని చేస్తా.


క్లుప్తంగా

నాయీబ్రహ్మణ నూతన కమిటీ ఏర్పాటు



గట్టు: నాయీబ్రహ్మణ నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. నాయీబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా భీమేష్ (గట్టు), ఉపాధ్యక్షుడిగా శేఖర్ (ఇందువాసి) గౌరవ అధ్యక్షులుగా శివశంకర్ (ఆలూరు), కోశాధికారిగా శ్రీనివాసులు (బల్గెర), ప్రధాన కార్యదర్శిగా నారాయణ (గట్టు), కార్యదర్శిగా కర్రెప్ప(ఆరగిద్ద), సహాయ కార్యదర్శిగా కృష్ణ (బోయలగూడెం), ఉప ప్రధాన కార్యదర్శిగా తిమ్మరాజు, సంఘం సభ్యులుగా నర్సింహులు, గోవిందు, తిప్పన్న, కిష్టప్ప, తరుణమేలస్, ఆంజనేయులు, తిరుమలేష్, ఈరన్న, రవికుమార్, సుధాకర్, శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయీబ్రహ్మణ సంఘం నాయకులు తెలిపారు.

గుడిసె దగ్ధం



కేటీదొడ్డి: గుర్తు తెలియని దుండగులు గుడిసె దగ్ధం చేసిన సంఘటన మండలంలోని ఈర్లబండ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్కబాయి చిన్న నర్సింహులుకు చెందిన గుడిసెను తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. దీన్ని గమనించిన స్థానికులు యజమానికి తెలిపడంతో వచ్చి చూడగా గుడిసెతో పాటు కూరగాయల క్యాన్లు, డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయి ఆస్తి నష్టం రూ.20వేలు అయినట్లు తెలిపారు. మలక్బాయి చిన్న నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం



కేటీదొడ్డి: మహిళ అదృశ్యమైన సంఘటన మండలం లోని మల్లాపురంతండాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్ర కారం.. మంగ్యానాయక్‌కు ఇద్దరు భార్యలున్నా రు. ఆయన మొదటి భార్యతో తరచుగా రెండో భార్య, భర్త గొడవ పడేవారు. దీంతో ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు మొదటి భార్య వెళ్లిపోయింది బంధువులు కుటుంబ సభ్యులు వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో మొదటి భార్య (సరోజబాయి) తమ్ముడు శంకర్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బోయపెద్ద నర్సింహులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా మంగళవారం కోదండాపురం స్టేజీ సమీపంలో పోలీసులు తనిఖీ చేసి 5.4 లీటర్లు (రూ.5400 విలువైన) మాద్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కృష్ణదేవా తెలిపారు. అదుపులోకి తీసుకున్న మద్యాన్ని పీఎస్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఓటర్లకు వీల్‌చైర్ రెడీ

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వస్తువుల పనులు పూర్తి చేశారు. కంచుపాడులో వికలాంగుల ఓటర్ల కోసం వీల్‌చైర్‌ను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసి సిద్ధం చేశారు.

ఘనంగా స్వామి బ్రహ్మోత్సవాలు


కోరుకొండయ్య స్వామి వారి అలంకరణ


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండలంలోని చింతరేవుల గ్రామ సమీపంలోని కోరుకొడయ్య గట్టుపై వెలసిన కోరుకొండయ్య స్వామి (శ్రీ వెంకటేశ్వర స్వామి) బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవానికి చుట్టు పక్కల గ్రామాలైన గుడ్డెందొడ్డి, మాల్‌దొడ్డి, ద్యాదొడ్డి, మన్నాపురం, పారుచర్ల, చిన్నపాడు, చింతరేవుల, పెద్దపాడు, ఎములోనిపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, రాజేష్ పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు ఘన నివాళి


గట్టులో జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గట్టు: మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాలకు చదువు వచ్చిందంటే, రిజర్వేషన్లు అమలు అవుతున్నాయంటే, మహిళలకు చదువుకునే హక్కు వచ్చిందంటే జ్యోతిరావు పూలే చేసిన పో రాట ఫలితమే అని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద, నర్సింహ, నాగేంద్రం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏసన్న, సురేష్, సామేలు, జయలక్ష్మి, సరోజ, దేవి, శాంతి, నాగేశ్వరి, మునెప్ప, పాండు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వివేకానంద సర్కిల్‌లో జ్యోతిరామ్‌పూలే 133వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సామాజిక రుగ్మతుల కోసం పోరాడిన వ్యక్తి జ్యోతిరావుపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, శ్రీను, రాఘవేంద్ర, శంకర్ నాయుడు, హమాలి నాయకులు పాల్గొన్నారు.

జీతాల్లేక అర్చకుల అవస్థలు..

జోగుళాంబ శక్తిపీఠం: నిత్యం భగవంతుడి సన్నిధిలో సర్వేజనాఃసుఖినోభవంతూ అంటూ దేవున్ని అందరి శ్రేయస్సు కోసం ప్రార్థించే అర్చకులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. ధూప, దీప, నైవేద్యం కింద రూ.6 వేలు ఉన్న వేతనాన్ని రూ.10 వేలకు పెంపొందిస్తున్నట్టు ప్రకటనలు చేయడం, ఉత్తర్వులు ఇవ్వడం తప్పితే వేతనాలు ఇచ్చినదాఖలాలు కనిపించడం లేదని గ్రామీణ ప్రాంతాలలో అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ధూప, దీప, నైవేద్యం పథకం కింద 653 ఆలయాలకు నెలనెలా ఇవ్వాల్సిన వేతనాలు 3 లేదా నాలుగు నెలలకోసారి ఒకనెల వేతనం మాత్రమే ఇస్తూ మిగితా వేతనాలను పెండింగ్‌లో పెడుతున్నారు. పాత వేతనాలే సరిగా రావడం లేదని, ఇక రూ.6వేల ఉన్న వేతనాన్ని 10 వేలకు పెంపొందించామంటూ ఉత్త మాటలు చెప్పడమే తప్ప వేతనాలు ఇచ్చిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నూతంగా మరి కొన్ని ఆలయాలను ధూప, దీప, నైవేద్యం కింద పెంపొందించినప్పటికీ వారికి మాత్రం వేతనాలు పడటం లేదని అర్చక, ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. వేతనాల జాప్యానికి గల కారణంపై అటు రాష్ట్ర అర్చక సంఘాల నేతలు కానీ, ఇటూ జిల్లా దేవదాయశాఖ అధికారులు నోరు మెదపడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా తమకు చెల్లించాల్సిన వేతనాలను సక్రమంగా చెల్లించి అర్చక, ఉద్యోగుల కుటుంబాలకు ఆకలి బాధలు తీర్చాలని వేడుకుంటున్నారు.

ఓటర్ల ప్రసన్నం కోసం పాట్లు

ధరూరు: ఓట్లకు కేవలం ఒక్క రోజు మాత్రమే సమయం ఉండడంతో మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు ఇతరులు ఇంటింటి ప్రచారంలో తలమునకలయ్యారు. కొందరు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గ్రామాల్లో చికెన్, కూల్ డ్రింక్స్‌ను పంపిణీ చేశారు. ఈ ఒక్కసారి తమ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. మహిళలను ఆకర్షితులను చేసేందుకు ఇతర బహుమతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 3న జరిగే ఓట్ల లెక్కింపు రోజే ఎన్నికల బరిలో నిలుచున్న నేతల భవితవ్యాలు బయట పడనున్నాయి.

జోరుగా ఎన్నికల ప్రచారం

● వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని బీజేపీ గద్వాల అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు, అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని నందిన్నె, చింతకుంట, మల్లాపురం గ్రామాల్లోని వాల్మీకి నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

● ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాలంలోని ఆయా గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీ, బీఎస్పీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో గడప గడపకు తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధి జరుగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు గౌతంరెడ్డి అన్నారు. అయిజ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

● పూల్లురు బిడ్డవే కాదా.. అలంపూర్ నియోజవర్గరంలో అభివృద్ధి ఎక్కడ చేశారో చూపించాలని మానవపాడు మండల ప్రజలు నీ కంటే ఎక్కువ ఓట్లతో అత్యధిక మెజార్టీ ఇచ్చారని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నకుమార్ తెలిపారు. మానవపాడు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే 6 గ్యారంటీ పథకాలపై గట్టు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గద్వాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సరితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సర్పంచు ధనలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు శ్రీనాథ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

● ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన బీఆర్ఎస్, మతతత్వ బీజేపీ, ఎంఐఎం పార్టీలకు తగిన బుద్ధిచెప్పాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు జమ్మిచేడు కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


అలంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడుకు మద్దతుగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కార్యకర్తలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ ప్రాంతం బాగుండాలంటే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మానవపాడు మండలంలోని చందూరు, ఉండవెల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తాలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రజలను కోరారు.

అయిజ: అలంపూర్ నియోజకరవ్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కారుగుర్తుకు ఓటేసి, చల్లా వెంకట్రామిరెడ్డి బలపరిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజేయుడిని గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు, సుజాత దంపతులు కోరారు.

గద్వాల అభివృద్ధికి అవకాశం ఇవ్వాలి


మల్దకల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సరిత

మల్దకల్: గద్వాల అభివృద్ధికి ఒక్కసారి గద్వాల ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని, ప్రజలకు రుణపడి ఉంటానని గద్వాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత ఓటర్లను కోరారు. మంగళవారం మల్దకల్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల, బహుజన బిడ్డగా కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గద్వాలలో కుటుంబ రాజకీయాలు చేస్తూ, అభివృద్ధిని విస్మరించినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసినట్లు తెలిపారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, మల్దకల్, గోపాల్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి.. అహంకారానికి ఎన్నికలు


మారమునగాలలో ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్ కుమార్

ఉండవెల్లి: ఓటు వేసే సమయంలో 'ఆత్మగౌరవానికా.. అహంకారానికా' ఆలోచించి ఓటు వేయా లని అలంపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మారమునగాల-1,2, ప్రాగటూరు, శేరుపల్లె, తక్కశిల, కంచుపాడు, ఉండవెల్లి, పుల్లూరు, మెన్నిపాడు, బొంకూరు గ్రామాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మపై అభిమానంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మార్పు రావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాగటూరు, లింగన్‌వాయి తదితర గ్రామాల్లో అప్పట్లో ఫ్యాక్షన్ ఉండేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అన్ని బంద్ చేశామన్నారు. అందరు ఆలోచించి చదువుకున్న వారికి ఓటు వేయాలని పేర్కొన్నారు.

పశువుల సంతకు సెలవు

అయిజ: స్థానిక శాసనసభ సాధారణ ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్న సందర్భంగా గురువారం పశువుల సంతకు సెలవు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు నం.1463 ప్రకారం గురువారం సాధారణ సెలవు ఉన్నందు వల్ల అయిజ మండల కేంద్రంలో ప్రతి గురువారం మార్కెట్ సబ్‌యార్డ్‌లో నిర్వహించనున్న పశువుల సంతకు సెలవు ప్రకటించినట్లు జిల్లా మార్కెట్ ఆఫీసర్ పుష్పమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
204	95
66,174	19,890

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు సోమవారం ముగింపు)

నాస్‌డాక్	14,241	▽	10
డోజోన్స్	35,333	▽	57
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,431	▽	30
డాక్స్	15,937	▽	29
షాంఘై	3,039	△	7
నికాయ్	33,408	▽	39

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.62	84.29
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	103.73	107.11
€	యూరో	ఒకటికి	89.88	92.96
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	55.49	57.19
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	54.31	56.78
SAR	సౌదీ రియాల్	ఖాయమనకి	21.19	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమనకి	21.79	22.99
¥	చైనా యువాన్	ఖాయమనకి	10.49	12.58

70 లక్షల మొబైల్ నంబర్స్ రద్దు

అనుమానాస్పద లావాదేవీలు కారణం



న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలకు చెక్ చెప్పే దిశగా 70 లక్షల మొబైల్ నంబర్లను సస్పెండ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వివేక్ జోషి తెలిపారు. ఆయా నంబర్లపై అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్థికాంశాలకు సంబంధించిన సైబర్ భద్రత, డిజిటల్ పేమెంట్ల మోసాలు పెరుగుతుండటం తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ విషయాలు తెలిపారు. ఇటువంటి సమావేశాలు మరిన్ని నిర్వహించనున్నట్లు, జనవరిలో తదుపరి భేటీ ఉండనున్నట్లు జోషి చెప్పారు. మోసాల బారిన పడకుండా అమాయక కస్టమర్లను కాపాడేందుకు సైబర్ మోసాల గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ పేమెంట్ మోసాలు, వాటిని కట్టడి చేయడంలో ఎదురవుతున్న సవాళ్లపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ ఈ సమావేశంలో ప్రెజెంటేషన్ ఇచ్చింది.

బెంగళూరులో ఏఎండీ గ్లోబల్ డిజైన్ సెంటర్



న్యూఢిల్లీ: అమెరికా సెమీకండక్టర్ దిగ్గజం ఏఎండీ తాజాగా బెంగళూరులో గ్లోబల్ డిజైన్ సెంటర్‌ను ప్రారంభించింది. 5,00,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించినట్లు కంపెనీ వివరించింది. ఇది తమకు అతి పెద్ద గ్లోబల్ డిజైన్ సెంటర్ అని తెలిపింది. భారత్‌లో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో భాగంగా ఏఎండీ దీన్ని ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో ఈ సెంటర్‌లో 3,000 మంది ఇంజనీర్లు ఉంటారని కంపెనీ తెలిపింది. 3డీ స్టాకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌తో పాటు సెమీకండక్టర్ టెక్నాలజీ డిజైనింగ్, అభివృద్ధి కార్యకలాపాలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించింది.

భారత్‌లో మరో 1.6 బిలియన్ డాలర్లు

విస్తరణ బాటలో ఫాక్స్‌కాన్

- ఇప్పటికే 8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగం



ముంబై: ఐఫోన్ల కాంట్రాక్ట్ తయారీ సంస్థ, తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భారత్‌లో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 13 వేల కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తైవాన్‌లోని స్టాక్ ఎక్స్చేంజీలకు సంస్థ తెలియజేసింది. భారత్‌లోని తమ అనుబంధ సంస్థ హోన్ హాయ్ టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ ద్వారా పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. చైనాకు మాత్రమే పరిమితం కాకుండా కార్యకలాపాలను ఇతర దేశాలకు కూడా మళ్లించే వ్యూహంలో భాగంగా (చైనా ప్లస్ వన్) కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండటం తరచుగా సమస్యలకు దారి తీస్తున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. ఫాక్స్‌కాన్ ఇప్పటికే భారత్‌లో దాదాపు 8 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. భారత మార్కెట్లో అవకాశాల రీత్యా ఇక్కడ తమ పెట్టుబడులను గతేడాదితో పోలిస్తే మరింతగా పెంచుకునే అవకాశం ఉందని కంపెనీ చైర్మన్ యంగ్ లియు ఇటీవలే తెలిపారు.

ఐఫోన్ల తయారీలో టాప్..

అమెరికా టెక్ దిగ్గజం యాపిల్‌కు అత్యధికంగా ఐఫోన్‌లను సరఫరా చేసే కాంట్రాక్ట్ తయారీ సంస్థల్లో ఫాక్స్‌కాన్‌ది అగ్రస్థానం. భారత్‌లోనూ పోటీ సంస్థలైన టాటా, పెగాట్రాన్‌కు మించి ఉత్పత్తి చేస్తోంది. ఫాక్స్‌కాన్ ఆదాయంలో దాదాపు సగభాగం ఐఫోన్ల తయారీ ద్వారానే ఉంటోంది. కంపెనీకి భారత్‌లో 40,000 మంది పైగా వర్కర్లు ఉన్నారు. ఇక్కడ మొత్తం 30 ఫ్యాక్టరీలు ఉండగా, ఏటా దాదాపు 10 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తోంది. 2022లో ఫాక్స్‌కాన్ ఆదాయం 216 బిలియన్ డాలర్లు కాగా అందులో భారత విభాగం వాటా 4.6%గా నమోదైంది. అంతక్రితం ఏడాది 2021లో ఇది 2%గా ఉండేది. తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కోసం మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఫాక్స్‌కాన్ యోచిస్తోంది. అటు కర్ణాటకలో రూ. 8,800 కోట్లతో ఐఫోన్ విడిభాగాల యూనిట్ నెలకొల్పే యోచన కూడా ఉంది. ఇందుకు తుమకూరులోని జపాన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో స్థలాన్ని కూడా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. కొత్తగా ప్రతిపాదించిన 1.6 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికల్లోనే ఈ ఇన్వెస్ట్‌మెంట్ కూడా భాగంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీతో కొత్తగా 14,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగవచ్చని అంచనా. ఇందులో ఫోన్ స్క్రీన్‌లు, వెలుపలి కవరింగ్‌లు తయారు చేసే అవకాశం ఉంది.

సెమీకండక్టర్లపైనా దృష్టి..

భారత్‌లో తొలి సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఫాక్స్‌కాన్ సైతం పోటీపడుతోంది. ఇందుకోసం ముందుగా వేదాంత సంస్థతో జట్టు కట్టినప్పటికీ, తర్వాత ఆ జాయింట్ వెంచర్ నుంచి పక్కకు తప్పుకుంది. భారతీయ భాగస్వామి అవసరం లేకుండా సొంతంగానే ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఇందుకు సంబంధించి తమ ఫ్యాబ్ యూనిట్ ప్లాన్‌కి ఆమోదం పొందేందుకు ప్రభుత్వంతో చర్చలు కూడా జరుపుతున్నట్లు కంపెనీ గతంలో తెలిపింది.

డెట్ మార్కెట్లో ఎఫ్‌పీఐల జోరు

నవంబర్‌లో రూ. 12,400 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ రుణ సెక్యూరిటీల (డెట్) మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ నెల (నవంబర్ 27)లో ఇప్పటి వరకూ రూ. 12,400 కోట్ల విలువైన పెట్టుబడులు చేపట్టారు. గత రెండేళ్లలో ఇవి అత్యధికంకాగా.. ఆకర్షణీయ ఈల్డ్స్ ప్రభావం చూపుతున్నాయి. వర్ధమాన మార్కెట్ల జేపీ మోర్గాన్ గవర్నమెంట్ బాండ్ ఇండెక్స్‌లో దేశీ జీసెక్యూరిటీలను చేర్చడం ఇందుకు తోడ్పాటునిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కేలండర్ ఏడాది(2023) ప్రారంభంనుంచీ ఎఫ్‌పీఐలు దేశీ డెట్ మార్కెట్లపట్ల ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. వెరసి మార్చి మినహా ఏడాది పొడవునా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలియజేశారు. మార్చిలో మాత్రం నికరంగా రూ. 2,505 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. కాగా.. తాజా పెట్టుబడులతో కలిపి రుణ సెక్యూరిటీలలో ఎఫ్‌పీఐల ఇన్వెస్ట్‌మెంట్స్ రూ. 47,900 కోట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ బాటలో 2021 సెప్టెంబర్ (రూ. 12,804 కోట్లు) తదుపరి తిరిగి ఈ నెలలో అత్యధికంగా రూ. 12,400 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

2 నెలల గరిష్టానికి నిఫ్టీ

మళ్లీ 66 వేల పైకి సెన్సెక్స్



ముంబై: అదానీ గ్రూప్ షేర్లు అదరగొట్టడంతో మంగళవారం నిఫ్టీ 95 పాయింట్లు పెరిగి 2 నెలల గరిష్ట స్థాయి 19,890 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 204 పాయింట్లు బలపడి 66,174 వద్ద నిలిచింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ఇంధన షేర్లు రాణించడం కూడా కలిసొచ్చింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ట్రేడింగ్ చివర్లో ఆటో, విద్యుత్, మెటల్ షేర్లకు డిమాండ్ లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 286 పాయింట్లు పెరిగి 66,064 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 19,917 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేసింది. ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.784 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,325 కోట్ల షేర్లు కొన్నారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

హిండెన్‌బర్గ్ ఆరోపణలు పరిశీలించాలంటూ కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేయడం అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లూ లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా అదానీ టోటల్ గ్యాస్ 20% ర్యాలీ చేసింది. అదానీ గ్రీన్ సొల్యూషన్స్ 19%, అదానీ గ్రీన్ 12%, ఎన్‌డీటీవీ 12%, అదానీ విల్మార్ 10%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 9% చొప్పున లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 5%, అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ సిమెంట్స్ 3% పెరిగాయి. ఫలితంగా గ్రూప్ కంపెనీల సంయుక్త మార్కెట్ క్యాపిటలైజేషన్ మంగళవారం ఒక్కరోజే రూ. ఒక లక్ష కోట్లకు పైగా పెరిగి రూ.11.31 లక్షల కోట్లకు చేరింది.

వాహనాలకు పండుగ గిరాకీ..

- 42 రోజుల్లో 37.93 లక్షల ఆటో మొబైల్ అమ్మకాలు
- డీలర్ల సమాఖ్య ఫాడా గణాంకాలు వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది పండుగ సీజన్‌లో దేశీయంగా 37,93,584 వాహనాలు అమ్ముడైనట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 19% వృద్ధి నమోదైనట్లు తెలిపింది. వ్యవస్థలో నెలకొన్న బలమైన డిమాండ్ ఇందుకు కారణమని చెప్పుకొచ్చింది. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ రోజైన అక్టోబర్ 15 నుంచి నవంబర్ 25 వరకు(42 రోజులు) జరిగిన విక్రయాలకు సంబంధించిన గణాంకాలు ఫాడా మంగళవారం విడుదల చేసింది. ట్రాక్టర్లు మినహా అన్ని వాహన విభాగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైనట్లు వివరించింది.

- ప్యాసింజర్ వాహన అమ్మకాలు 4,96,047 నుంచి 10% పెరిగి 5,47,246కి చేరాయి. ''సీజన్ తొలినాళ్లలో స్తబ్దుగా ఉన్న విక్రయాలు దీపావళి నుంచి భారీగా పుంజుకున్నాయి. స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్(ఎస్‌యూవీ)లకు భారీగా డిమాండ్ లభించింది'' అని ఫాడా అధ్యక్షుడు మనీష్ రాజ్ సిన్హా తెలిపారు.
- ద్విచక్ర వాహన విక్రయాలు 21% వృద్ధి పెరిగి 23,96,665 నుంచి 28,93,107 యూనిట్లకు చేరాయి. గ్రామీణ ప్రాంతం గిరాకీ పుంజుకోవడంతో రికార్డు స్థాయి విక్రయాలు జరిగినట్లు సిన్హా పేర్కొన్నారు.
- వాణిజ్య వాహన అమ్మకాలు 8% వృద్ధి చెంది 1,23,784 యూనిట్లకు చేరాయి.
- వార్షిక ప్రాతిపదికన త్రిచక్ర వాహన విక్రయాలు 41% పెరిగి 1,01,052 యూనిట్ల నుంచి 1,42,875 యూనిట్లకు చేరాయి.
- ట్రాక్టర్ల అమ్మకాల్లో 0.44% క్షీణత నమోదైంది. గతేడాదిలో 86,951 ట్రాకర్లు అమ్ముడవగా, ఈసారి 86,572 యూనిట్లకు పరిమితమయ్యాయి. దసరా సమయంలో 8.3% క్షీణత నమోదైన ట్రాకర్ల విక్రయాలు సీజన్ చరమాంకానికి భారీ రికవరీ సాధించాయని సిన్హా వివరించారు.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎయిమ్స్ సంస్థల్లో 3036 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

న్యూఢిల్లీలోని కామన్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ ఫర్ ఎయిమ్స్ (సీఆర్‌ఈ–ఎయిమ్స్).. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైటీషియన్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ లాండ్రీ సూపర్‌వైజర్, అసిస్టెంట్ స్టోర్ ఆఫీసర్, ఆడియోలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్, బయో మెడికల్ ఇంజనీర్, క్యాషియర్, కోడింగ్ క్లర్క్, డార్క్‌రూమ్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డెంటల్ హైజీనిస్ట్, డైటీషియన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/పదో తరగతి, ఐటీఐ, 12వ తరగతి/ఇంటర్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ, టైపింగ్/డ్రైవింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** సీబీటీ రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.12.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.12.2023 నుంచి 07.12.2023
» **అడ్మిట్ కార్డుల జారీ:** 12.12.2023.
» **పరీక్ష తేదీలు:** 18.12.2023 నుంచి 20.12.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

ఏఏఐసీఎల్ఏఎస్, న్యూఢిల్లీలో 906 సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ (ఏఏఐసీఎల్ఏఎస్).. దేశవ్యాప్తంగా ఏఏఐసీఎల్ఏఎస్ కేంద్రాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 906
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కుల(ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం)తో ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్శిటీ/సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్, హిందీ లేదా స్థానిక భాషతో మాట్లాడే సామర్థ్యం కలిగి ఉండాలి. **వయసు:** 01.11.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **పోస్టింగ్ స్థలం:** చెన్నై, కోల్‌కతా, గోవా, కోజికడ్ (కాలికట్), వారణాసి, శ్రీనగర్, వడోదర, మధురై, తిరుపతి, రాయ్‌పూర్, వైజాగ్, ఇండోర్, అమృత్‌సర్, భువనేశ్వర్, అగర్తల, పోర్ట్ బ్లెయిర్, తిరుచ్చి, డెహ్రాడూన్, పుణె, సూరత్, లేహ్ శ్రీనగర్, పాట్నా.
» **వేతనం:**నెలకు రూ.30,000 నుంచి రూ.34,000
» **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కులు, ఐ/కలర్ బ్లైండ్‌నెస్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.12.2023
» **వెబ్‌సైట్:** www.aaiclas.aero

ఏపీ సివిల్ సప్లైస్, పార్వతీపురంలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్.. పార్వతీపురం మన్యం జిల్లాలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **అర్హత:** బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/బయోటెక్నాలజీ/డ్రైల్యాండ్ అగ్రికల్చర్/బోటనీ) ఉత్తీర్ణులై ఉండాలి.**వయసు:**35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు(టీపీ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లైస్ మేనేజర్ ఆఫీస్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్,జిల్లా కార్యాలయం, సబ్ కలెక్టరేట్ కాంపౌండ్, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023.
» **వెబ్‌సైట్:** parvathipurammanyam.ap.gov.in

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 12 టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు

ఏలూరులోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** డిగ్రీతో కంప్యూటర్స్ లేదా బీఈ, బీటెక్/బీసీఏ/ఎంసీఏ లేదా డిగ్రీతో పీజీడీసీఏ, హయ్యర్ గ్రేడ్ టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.18,500.
» **ఎంపిక విధానం:** డిగ్రీ, అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023
» **వెబ్‌సైట్:** https://westgodavari.ap.gov.in

స్కిల్ ఉంటేనే.. కొలువు!

» ఐటీలో తగ్గనున్న ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్
» స్కిల్స్ అప్ గ్రేడ్ చేసుకుంటేనే అవకాశాలు
» బీఎఫ్ఎస్ఐ, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్‌లో జాబ్స్

ఏ రంగంలో నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.. ఐటీలో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ పరిస్థితి ఎలా ఉంది.. ఏ స్కిల్స్‌కు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది..? ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులకు ఇలాంటి సందేహాలెన్నో!! ముఖ్యంగా నవంబర్ వచ్చిందంటే.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్, జాబ్ మార్కెట్ పరిస్థితులపై ఎంతో ఆసక్తి. కారణం.. మరికొద్ది నెలల్లో వారంతా కోర్సులు పూర్తి చేసుకొని ఉద్యోగ వేటలో జాబ్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తుండటమే!! ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ ట్రెండ్స్, డిమాండింగ్ స్కిల్స్, ఉద్యోగ సాధనకు మెలకువలపై ప్రత్యేక కథనం..



ఐటీ రంగంలో ఈ ఏడాది నియామకాలు తక్కువగా ఉంటాయని ఇప్పటికే అంచనాలు వెలువడ్డాయి. మరోవైపు ఐటీని మినహాయించి.. ఇతర రంగాల్లో రిక్రూట్‌మెంట్స్‌లో వృద్ధి కనిపించనుందని, విద్యార్థులు సదరు రంగాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆ మూడు సెక్టార్లు

తాజా జాబ్ మార్కెట్ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే.. ముఖ్యంగా మూడు రంగాలు నియామకాల్లో ముందున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్,హాస్పిటాలిటీ రంగాల్లో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ పెరగనున్నాయి. దీంతోపాటు ఈ–కామర్స్, టెక్ స్టార్టప్స్, టెలికమ్యూనికేషన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లోనూ ఫ్రెషర్స్ నియామకాల్లో వృద్ధి కనిపించనుంది.

నౌకరీ డాట్ కామ్ నివేదిక ప్రకారం–సెప్టెంబర్ చివరికి బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ సెక్టార్ల నియామకాల్లో ఏడు శాతం పెరుగుదల కనిపించింది. బీఎఫ్ఎస్ఐలోని బ్యాంకింగ్ విభాగంలో గత సెప్టెంబర్‌తో పోల్చితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో నియామకాల్లో 40 శాతం వృద్ధి కనిపించింది. ఈ రంగంలో మొత్తం ఏడు శాతం వృద్ధి కనిపించగా.. ఇందులో ఇన్సూరెన్స్ విభాగంలో నాలుగు శాతం మేరకు ఉద్యోగాలు తగ్గడం గమనార్హం. ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ సెక్టార్‌లో 22 శాతం, ఫార్మా/బయోటెక్/క్లినికల్ రీసెర్చ్ విభాగంలో 11 శాతం; ఆటోమోటివ్స్, ఆయిల్ అండ్ గ్యాస్/పవర్ సెక్టార్లలో ఆరు శాతం చొప్పున నియామకాల్లో వృద్ధి నమోదైంది.ఐటీ సాఫ్ట్‌వేర్/సాఫ్ట్‌వేర్ సర్వీసెస్‌లో మాత్రం 43 శాతం మేర నియామకాలు తగ్గడం గమనార్హం.

ఈ-కామర్స్, టెక్ స్టార్టప్స్

ఈ ఏడాది ఫ్రెషర్స్ నియామకాల్లో ఈ–కామర్స్ అగ్రస్థానంలో ఉంటుందని టీమ్‌లీజ్ నివేదిక పేర్కొంది. ఈ మేరకు కెరీర్ ఔట్‌లుక్ రిపోర్ట్ 2023–హెచ్‌వై2 (జులై–డిసెంబర్) పేరుతో ప్రత్యేక నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం– ఈ–కామర్స్, టెక్ స్టార్టప్స్‌లో ఈ ఏడాది ద్వితీయార్థంలో 59 శాతం మేరకు ఫ్రెషర్స్ నియామకాలు జరగనున్నాయి. అదే విధంగా టెలికమ్యూనికేషన్స్‌లో 53 శాతం; ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో 50 శాతం చొప్పున రిక్రూట్‌మెంట్స్‌లో పెరుగుదల కనిపించనుంది. ఐటీ విభాగంలో 49 శాతం; హెల్త్ కేర్/ఫార్మా రంగంలో 42 శాతం; కన్‌స్ట్రక్షన్ అండ్ రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో 21 శాతం; ఎఫ్ఎంసీజీలో 24 శాతం; కన్సల్టింగ్‌లో 13 శాతం చొప్పున నియామకాల్లో పెరుగుదల నమోదైంది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది ప్రథమార్థంతో పోల్చితే ద్వితీయార్థంలో మూడు శాతం మేర ఫ్రెషర్ నియామకాలు పెరుగుతాయని నివేదిక స్పష్టం చేసింది.

హాస్పిటాలిటీలో 60 శాతం!

ఈ ఏడాది ద్వితీయార్థంలో హాస్పిటాలిటీ రంగంలో నియామకాల్లో 60 శాతం వృద్ధి నమోదవుతుందని పలు సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హెల్త్ టూరిజం, బిజినెస్ ట్రావెల్, డొమెస్టిక్ పర్సనల్ టూర్స్‌లో పెరుగుదల కనిపిస్తుండడమే ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. ఈవెంట్ కో ఆర్డినేటర్, జూనియర్ చెఫ్, ట్రావెల్ ఏజెంట్స్, రిసార్ట్ మేనేజర్స్, హోటల్ స్టాఫ్, హౌస్ కీపింగ్ విభాగాల్లో మానవ వనరులకు డిమాండ్ ఏర్పడనుంది. ఇదే సమయంలో స్కిల్ గ్యాప్ సమస్య కూడా ఈ రంగంలో ఉందని, సంబంధిత కోర్సుల అభ్యర్థులకు అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు.

బీఎఫ్ఎస్ఐలోనూ ఇదే జోరు

బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో ముఖ్యంగా.. బ్యాంకింగ్ విభాగంలో నియామకాలు గతేడాది మాదిరిగానే కొనసాగుతాయని అంచనా. క్రెడిట్ కార్డ్ సేల్స్, కస్టమర్ సర్వీస్ ఏజెంట్స్, బ్రాంచ్ మేనేజర్స్ హోదాల్లో ఎక్కువ నియామకాలు ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా అనలిటిక్స్ ఆధారిత సేవలు పెరగడం కూడా ఈ రంగంలో నియామకాలకు ఊతంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.

కన్సల్టింగ్.. తయారీ

ఫైనాన్షియల్ కన్సల్టింగ్ సెక్టార్‌లోనూ నూతన నియామకాల్లో జోరు కొనసాగనుంది. బిజినెస్ ఆపరేషన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ టెక్నాలజీ, డేటా సైన్స్ తదితర విభాగాల్లో అయిదు వేలకుపైై నియామకాలు జరగనున్నాయి. ఇక దేశ జీడీపీలో కీలకమైన తయారీ రంగం.. నియామకాలకు ఊతంగా నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రంగంలో దాదాపు 20 వేలకు పైగా కొత్త ఉద్యోగాలు సెప్టెంబర్–డిసెంబర్ మధ్య కాలంలో లభిస్తాయని అంచనా. 5జీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, ఇండస్ట్రియల్ ఐఓటీ, ఆర్ అండ్ డీ కార్యకలాపాల్లో పెరుగుదలే ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు.

ఐటీలో ఇలా

దేశ ఐటీ రంగంలో దాదాపు 50 వేల ఉద్యోగాలు ఫ్రెషర్స్‌కు అందుబాటులోకి రానున్నట్లు అంచనా. దిగ్గజ సంస్థలతో పోల్చితే మధ్య తరహా ఐటీ సంస్థల్లో నియామకాలు కొంత ఎక్కువగా ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. బిగ్ డేటా టెస్టింగ్ ఇంజనీర్, ఐటీ ఆపరేషన్స్ మేనేజర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది.

జాబ్ ప్రొఫైల్స్

డెవాప్స్ ఇంజనీర్, చార్టర్డ్ అకౌంటెంట్, ఎస్ఈఓ అనలిస్ట్, యుఎక్స్ డిజైనర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది. అదే విధంగా డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా ఎక్కువగా లభించనున్నాయి.బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో.. బ్రాంచ్ మేనేజర్, ఫైనాన్షియల్ కన్సల్టెంట్ హోదాలకు డిమాండ్ ఉంది. హెల్త్‌కేర్ అండ్ ఫార్మా రంగంలో.. రీసెర్చర్స్, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ నెలకొంది.

ఈ స్కిల్స్‌కు డిమాండ్

డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ కమ్యూనికేషన్, డేటా సైన్స్, బ్లాక్ చైన్, బిజినెస్ అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ స్కిల్స్ ఉన్న వారికి జాబ్ మార్కెట్‌లో ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఫ్రెషర్స్ నియామకాల్లో సాఫ్ట్ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. క్రిటికల్ థింకింగ్, గ్రోత్ మైండ్ సెట్, టైమ్ మేనేజ్‌మెంట్, యాక్టివ్ లెర్నింగ్ దృక్పథం ఉన్న అభ్యర్థులకు అవకాశాలు లభిస్తాయని పేర్కొంటున్నారు.

అప్ స్కిల్లింగ్ మంత్ర

ఐటీలో తగ్గుతూ.. ఇతర రంగాల్లో నియామకాలు పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు అప్ స్కిల్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తేనే ఉద్యోగ సాధనలో ముందుంటారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ కీలకంగా మారిన ఏఐ/ఎంఎల్, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలు పొందేలా కృషి చేయాలని సూచిస్తున్నారు. ఐటీ ఉద్యోగాలు కోరుకునే వారు ఏఐ/ఐఓటీ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని.. డెవాప్స్, యుఎక్స్ డిజైన్ వంటి నైపుణ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలంటున్నారు.

ఎన్నో మార్గాలు

ఫ్రెష్ రిక్రూట్‌మెంట్స్‌లో కీలకంగా నిలుస్తున్న ఏఐ, ఐటీ స్కిల్స్‌ను సొంతం చేసుకునేందుకు ప్రస్తుతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, ఒరాకిల్, ఐబీఎం వంటి సంస్థలు అందిస్తున్న ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా సంబంధిత సర్టిఫికేషన్స్ సొంతం చేసుకుంటే.. ఉద్యోగ సాధనలో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 520, Amistapur Village, Bhoothpur Mandal, Mahabubnagar Dist - 509 382, Telangana, and Printed at Jagati Publications Limited, Survey No. 520, Amistapur Village, Bhoothpur Mandal, Mahabubnagar Dist - 509 382, Telangana. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0854 2236311. RNI Reg No. TELTEL/2008/23809.